

తెలుగు

# సరళ భారతి


ఎనిమిదవ తరగతి





ఏనుగు నల్లన

ఏనుగు




తెల్లన

చిట్టి




అమ్మ కొట్టిందా

తోట కెళ్ళావా




తెచ్చావా

కాళ్ళ



కంకాళమ్మ




వేగుచుక్క వెలగ

క్రమ సంఖ్య : ప్రాశిసం/2008-2009 మంజూరు/505(3) తేది : 26.11.2008

## తెలుగు

# సరళ భారతి

## ఎనిమిదవ తరగతి



మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె - 411 004.

ప్రథమ ప్రచురణ : 2009 © మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె - 411004

ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏ భాగమును గాని ఉటంకించుట లేదా పునర్ముద్రించుట చేయరాదు.

| | | |
|---|---|---|
| సంపాదక మండలి | : | శ్రీమతి భమిడిపాటి శారద, M.A, B.Ed, D.H.E.<br>శ్రీమతి విద్యా బెనర్జీ M.A, B.Ed,<br>శ్రీమతి టి. సుశీల M.A, M.Phil, B.Ed,<br>శ్రీమతి కె. అనూరాధ M.A, B.Ed,<br>శ్రీ భూమనపల్లి విజయభాస్కరరెడ్డి B.A, B.Ed,<br>శ్రీ హెచ్. ఇరేష్ B.A, B.Ed,<br>శ్రీ జె. ప్రభుదాస్ (B.Sc.) T.T.C.<br>డా॥ శ్రీమతి తులసీ భారత్, M.A, M.Phil, Ph.D. సమన్వయకులు |
| ప్రముఖ సంయోజకులు | : | డా॥ శ్రీమతి తులసీ భారత్, విశేషాధికారిణి-తెలుగు<br>మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె. |
| ముఖచిత్రం | : | శ్రీ గండూరి శ్రీనివాస్ Shri. Ganduri Srinivas |
| చిత్రములు | : | శ్రీ గండూరి శ్రీనివాస్ Shri. Ganduri Srinivas |
| | : | శ్రీ చంద్రశేఖర్ బేగంపురే Shri. Chandrashekar Begampure |
| అక్షర కూర్పు | : | సృష్టి, ఖార్‌ఘర్, నవి ముంబయి-410 210. |
| నిర్మితి | : | శ్రీ సంజయ్ కాంబ్లే, నిర్మితి అధికారి. |
| | : | శ్రీ సందీప్ అజ్‌గావ్‌కర్, నిర్మితి సహాయకులు. |
| కాగితము | : | 70 జి.యస్.యమ్. క్రీమ్‌వోవ్ |
| ముద్రణాదేశము | : | N/TECH - 2009-10 5 000 |
| ముద్రణ | : | Printek Graphix (India) Pvt. Ltd. |
| ప్రకాశకులు | : | శ్రీ. వివేక్ ఉత్తం గోసావి, కంట్రోలర్,<br>మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి సంస్థ,<br>ప్రభాదేవి, ముంబయి-25. |

# భారతదేశ సంవిధానము

## ప్రస్తావన

భారతదేశ ప్రజలమగు మేము, భారతదేశమును సార్వభౌమ్య
సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ
నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు సామాజిక,
ఆర్థిక, రాజకీయ, న్యాయమును, భావము,
భావప్రకటన, విశ్వాసము, ధర్మము, ఆరాధన -- వీటి
స్వాతంత్ర్యమును, అంతస్తులోను, అవకాశములోను
సమానత్వమును, చేకూర్చుటకు;
మరియు వారందరిలో వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,
అఖండతను తప్పక ఒనగూర్చు సౌభ్రాతృత్వమును,
పెంపొందించుటకు;
సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ
దినమున మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,
ఈ సంవిధానమును
అంగీకరించి, అధిశాసనము చేసి మాకు మేము
ఇచ్చుకొన్నవారమైతిమి.

# ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్నీ, ఉపాధ్యాయుల్నీ, పెద్దలందర్నీ గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# ప్రస్తావన

'మహారాష్ట్ర ప్రాథమిక విద్యాపాఠ్య ప్రణాళిక 2004' అనుసారము పాఠ్యపుస్తక సంస్థ ఇంగ్లీషు మాధ్యమములో సంయుక్త భాషగా హిందీతో బాటు తెలుగు నభ్యసింపగోరు విద్యార్థుల కొరకు 5 నుండి 8 తరగతుల నూతన తెలుగు సరళ భారతి పాఠ్యపుస్తకములను క్రమముగా 2006 - 07 విద్యా సంవత్సరము నుండి వెలువరించు కార్యక్రమమును చేపట్టినది. ఇందులో భాగంగా ప్రస్తుతము ఈ 8వ తరగతి **'సరళ భారతి'** పాఠ్యపుస్తకమును మీకందించుచున్నందులకు మిక్కిలి ఆనందించుచున్నాము.

ఇంగ్లీషు మాధ్యమము ద్వారా విద్యనభ్యసించు విద్యార్థులు తమ మాతృభాషను అవగాహన చేసికొనుట, చక్కగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట వంటి ప్రాథమిక భాషా నైపుణ్యాలను పొంది నిత్యజీవితంలో తమ మాతృభాషను ఉపయోగించు కొనుటకు అనువుగా ఈ పాఠ్యపుస్తకము తయారు చేయబడినది.

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇరుగు పొరుగు రాష్ట్రములగుటచే సంస్కృతి, చారిత్రాత్మక కట్టడాలు, కళలు మున్నగు వాటిలో అనేక సామ్యములున్నవి. ఈ పుస్తకము మహారాష్ట్రములో తెలుగు నభ్యసించు విద్యార్థుల కొరకు తయారు చేయబడినది. కావున ఈ సరళ భారతి మాలికలోని పుస్తకాల ముఖచిత్ర, మలి చిత్రాలను రెండు రాష్ట్రములు ప్రతిబింబించే విధంగా చిత్రించడం జరిగింది. ప్రస్తుతపు ఈ **ఎనిమిదవ తరగతి సరళ భారతి** అట్టలమీద మహారాష్ట్రలోని ఎల్లోరా, ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షికి విద్యార్థులు వినోదయాత్రకు వెళ్ళినట్లు చిత్రాలు చిత్రించబడ్డాయి. వీటిని గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరింతురని ఆశించుచున్నాము.

మహారాష్ట్రము నందలి వివిధ ప్రాంతములలోని పాఠశాలలలో తెలుగును నేర్పు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు సమీక్ష సమావేశములో ఒసగిన సూచనలను పరిశీలించి తగిన సవరణలు గావించి సంపాదక మండలి మరియు సమన్వయకులు ఈ పాఠ్యపుస్తకమునకు తుది స్వరూపమునిచ్చిరి.

సంపాదకమండలి, సమన్వయకులు మరియు చిత్రకారుల కృషి ఫలితముగా ఈ పుస్తకము రూపొందినది.

విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ పుస్తకమును ఆదరింతురని ఆశించుచున్నాము.

స్థలము : పుణె

తేది : 08.12.2008

శ్రీ. సు. నా. పవార్

సంచాలకులు

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు

పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ,

పుణె - 411 004.

# విషయసూచిక


| క్రసంఖ్య | పాఠము | పుట సంఖ్య |
| --- | --- | --- |
| | ● పద్యభాగం ● | |
| 1. | మనదేశం ..................... శ్రీ గిడుగురాజేశ్వరరావు | 1 |
| 2. | నీతి పద్యాలు ..................................... వేమన | 6 |
| 3. | చదువు విలువ .................... కె. రాజేశ్వరరావు | 10 |
| 4. | ఋతువులు .......................... ఆవుల లక్ష్మి | 15 |
| 5. | తెలుగు వెలుగు ................... బి. రాజ్యలక్ష్మిగుప్త | 20 |
| 6. | శతక పద్యాలు ...................... మారద వెంకయ్య | 25 |
| | ● గద్యభాగం ● | |
| 1. | గోరింక తెలివి ........................................ | 29 |
| 2. | మూడు అమూల్యాభరణాలు ..................... | 37 |
| 3. | గోకులాష్టమి ............................................ | 42 |
| 4. | లేఖ ....................................................... | 48 |
| 5. | తన కోపమే తన శత్రువు ......................... | 55 |
| 6. | వికీపీడియా (సంభాషణ) ........................ | 61 |
| 7. | అభినవ్ బింద్రా ......................................... | 67 |
| 8. | సౌగంధిక పుష్పం ...................................... | 71 |



# 1. మన దేశం

- గిడుగు రాజేశ్వరరావు



మనదేశం మనదేశం
మమతకు సమతకు... మానవాళికి
మార్గదర్శకం భారతదేశం... ॥మన॥

భరతుడు మును పాలించిన దేశం
పరమత సహనం విరిసిన దేశం
వర్ధమాన సిద్ధార్థ గౌతములు
పరమహంస ఉదయించిన దేశం... ॥మన॥

గంగా గౌతమి కావేరీ ఉద
కంబుల బంగరు పండిన దేశం
విశ్వకవుల కలకూజితములలో
వేదసార మెరిగించిన దేశం... ॥మన॥

అవని శాంతికై సమరము నిలిపిన
అశోకుడేలిన అఖండ దేశం
దాస్య విముక్తికి తమ ప్రాణములే
త్యజించి పోరిన త్యాగుల దేశం... ॥మన॥



## అభ్యాసం :

**1.** అర్థాలు :

మమత = అనురాగం ; మానవ + ఆళి = మానవుల సమూహం ; సహనం = ఓర్పు ; విరిసిన = వ్యాపించిన, కలిగిన ; పరమహంసలు = యోగులు, శ్రేష్ఠులు ; కలకూజితం = మనోహరమైన ధ్వని

భావం :

ప్రేమ, అనురాగములకు, సమానత్వమునకు మనదేశం నిలయం. మనదేశం మానవాళికి మార్గమును చూపించును. పూర్వం మనదేశమును భరతుడు పాలించినాడు. పరమత సహనం కలిగిన దేశం మనది. వర్ధమానుడు, సిద్ధార్థుడు, గౌతముడు మొదలగు మహనీయులు ఇక్కడ జన్మించిరి. గంగా, గౌతమి, కావేరి నదులు ఇచ్చటి జీవనదులు. వాటి నీటితో పాడిపంటలు ఇచ్చట వృద్ధిపొందినవి.

మహాకవులు తమ కలములతో వేదసారమును తెలియజేయుచు అనేక గ్రంథములు రచించిరి. ప్రపంచశాంతికై రక్తపాతం లేకుండా చేసిన అశోకుడు పాలించిన దేశం మన భారతదేశం.

ఈ దేశ స్వాతంత్ర్యమునకై అనేకమంది తమ ప్రాణాలను త్యాగం చేసిరి.

**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. మనదేశం ఎవరికి మార్గదర్శకము?
2. భారతదేశమున ప్రవహించు నదులేవి?
3. విశ్వకవులు దేనిని తెలియజేసిరి?
4. అశోకుడెట్టి వాడు?

**3.** 30-40 పదాలలో జవాబులు రాయండి.

1. మనదేశమున ఎటువంటి మహనీయులు జన్మించిరి?
2. జీవనదుల గురించి, విశ్వకవుల గురించి కవి ఏమి చెప్పెను?
3. మనదేశం త్యాగుల దేశమని ఎట్లు చెప్పగలవు?
4. 'మనదేశం' పాఠంనందు కవి ఏమి ప్రబోధించెను?

**4.** తగిన పదాలతో ఖాళీలను పూరించండి.

(సహాసం, అఖండ, పాలించిన)

1. భరతుడు మును .................. దేశం.
2. పరమత .................. విరిసిన దేశం.
3. అశోకుడేలిన .................. దేశం.



**5.** ఎవరు ఎవరితో అనిరి

1. "మానవాళికే మార్గదర్శకము."
2. "వేదసార మెరిగించిన దేశం."
3. "అశోకుడేలిన అఖండ దేశం."

**6.** పద్యాలను పూరించండి.

| | |
|---|---|
| 1. భరతుడు .................. | 2. అవని శాంతికై .............. |
| .......................... | .......................... |
| .......................... | .......................... |
| .......................... దేశం | ............ త్యాగుల దేశం |

**7.** గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. మనదేశం.
2. భరతుడు మును పాలించిన దేశం.

**8.** వచనాలను మార్చి రాయండి.

1. పరమహంసలు 2. ప్రాణము 3. కవి 4. ఉదకంబులు

**9.** పర్యాయ పదాలు.

1. ఉదకము = జలము, సలిలము, నీరు
2. బంగారము = స్వర్ణము, కనకము, హేమము
3. వేదము = అమ్నాయము, ఛందస్సు, తొలిపలుకు

**10. వ్యుత్పత్యర్థాలు**

1. అవని = రాజుచే రక్షింపబడునది, ప్రజలను రక్షించునది = భూమి.
2. కావేరి = కవేరుడను రాజర్షి కూతురు = ఒక నది

**11. జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. సమత | కై | ఉదయించిన దేశం |
| 2. కలకూజితముల | లో | సమరము నిలిపినది |
| 3. అవని శాంతి | కు | మార్గదర్శకం |
| 4. పరమహంస | లు | వేదసార మెరిగినది |

**ప్రాయోగిక వ్యాకరణము**

**సంధి :**

పూర్వపర స్వరములకు పరస్వరము ఏకాదేశమగుట సంధి యనబడును. రెండు అచ్చులకు మధ్య సంధి జరిగినపుడు రెండవ అచ్చు మాత్రమే నిలచుట సంధి.

పూర్వ స్వరము = మొదటి పదము చివరి అచ్చు

పర స్వరము = రెండవ పదము మొదటి అచ్చు

ఉదా : 1. రామ + ఆలయము = రామాలయము
(అ) (ఆ) (ఆ)

2. మానవ + ఆళి = మానవాళి
(అ) (ఆ) (ఆ)

3. అశోకుడు + ఏలిన = అశోకుడేలిన
(ఉ) (ఏ) (ఏ)

❖ ❖ ❖

పఠనం-లేఖనం :

సారాంశ లేఖనం :

ప్రపంచంలోని అన్ని దేశాలలో గత చరిత్రను తెలుసుకొనుటకు ఉపయోగపడే స్థలాలను చారిత్రిక స్థలాలు అంటారు. హైదరాబాదుకు సుమారు **10** కిలోమీటర్ల దూరంలో గల గోల్కొండ కూడా ఒక చారిత్రక ప్రదేశమే. గోల్కొండ దుర్గములో మూడు కోటలు, ఎనిమిది బురుజులు, ఎనిమిది ద్వారములు కలవు. చక్రవర్తి భవనాన్ని బాలాహిస్సారు అని పిలిచేవారు. ఈ భవనంపై గరుడ పక్షులు, సింహము బొమ్మలు చిత్రించబడివున్నాయి. హిందూ, మహమ్మదీయ సఖ్యతకు ఇవి శాశ్వత చిహ్నాలు. బాలాహిస్సారుకు ఎడమ భాగాన సిలాఖానా కలదు. అదే అప్పటి ఆయుధాగారం. దక్షిణంగా ఉన్న రెండు భవనాలు రాణుల మందిరాలు. ఇవి తారామతి, బాగమతి. అంబరుఖానా అప్పటి ధనాగారం. దీనికి పైన మసీదు, ఆ ప్రక్కనే దేవాలయం, భక్తరామదాసును బంధించిన కారాగారం కలవు. కోటలో కింద ద్వారం వద్ద చప్పట్లు కొడితే దూరంగా కొండ మీది భవనంలో వినిపిస్తుంది. ఆనాటి వైభవమంతా భూగర్భంలో కలిసిపోయినా గోల్కొండ కోట నేటికీ యాత్రికులను ఆకర్షిస్తున్నది. ఇది అందరూ తప్పక దర్శించదగినది.

ప్రశ్నలు :

1. చారిత్రక స్థలాలు అంటే ఏమిటి?
2. గోల్కొండ ఎచ్చట కలదు?
3. బాలాహిస్సారుపై ఏమి చిత్రించి వున్నాయి?
4. రాణుల మందిరాలేవి?



# 2. నీతి పద్యాలు

మిరెపు గింజ చూడ మీద నల్లగ నుండు
కొరికి చూడ నోరు చురుకు మనును
సజ్జనులగు వారి సార మిట్లుండురా
విశ్వదాభిరామ వినురవేమ.

కనగ సొమ్ములెన్నొ కనకంబ దొక్కటి
పసుల వన్నెలెన్నొ పాలొకటియె
పుష్పజాతులెన్నొ పూజయొక్కటె సుమీ
విశ్వదాభిరామ వినురవేమ.

బహుళ కావ్యములను పరికింపగా వచ్చు
బహుళ శబ్దచయము బలుకవచ్చు
సహన మొక్కటబ్బ చాల కష్టంబురా
విశ్వదాభిరామ వినురవేమ.

నిండు నదులు పాఱు నిల్చి గంభీరమ్మై
వెఱ్ఱివాగు పాఱు వేగబొర్లి
అల్పుడాడు రీతి నధికుండు నాడు నా
విశ్వదాభిరామ వినురవేమ.

- వేమన

## అభ్యాసం :

**1.** అర్థాలు :

**1.** సారము = లక్షణము

భావం : ఓ వేమా! మిరియపు గింజ చూచుటకు చిన్నదిగా, నల్లగా నుండును. కాని కొరికి చూచినచో నోరు మండి పోవును. సత్పురుషులును చూచుటకు నిరాడంబరులుగా నున్నను వారి మాటలు చాలా శ్రేష్ఠమైనవిగా ఉండును.

**2.** కనకం = బంగారం

భావం : ఓ వేమా! ఎన్ని ఆభరణములు చేయించినను అవి చేయబడిన బంగారమొక్కటే. ఎన్ని రంగుల పశువులైనను అవి ఇచ్చే పాలు ఒకే విధంగా ఉండును. ఎన్ని జాతుల పుష్పములను తెచ్చినను వాటితో చేయు పూజ యొక్కటే.

**3.** బహుళము = అనేకము ; పరికించుట = పరిశీలించుట ; శబ్దచయము = మాటల సమూహము ; సహనము = ఓర్పు

భావం : అనేక కావ్యములను పరిశీలింప వచ్చును. అనేక విధములుగా మాట్లాడవచ్చును. కాని ఓర్పుతో ఉండుట మాత్రము చాలా కష్టము.

**4.** పాఱు = ప్రవహించు ; రీతి = విధానము

భావం : నిండుగా నున్న నదులు నిల్చి గంభీరముగా ప్రవహించును. అవే చిన్న చిన్న వాగులు మాత్రం తుళ్ళుతూ ప్రవహించును. అదే విధంగా అల్పుడు మాట్లాడినట్లు అధికుడు తొందరపడి మాట్లాడడు.

**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. మిరియపు గింజ లక్షణమేమి?
2. సజ్జను లెట్లుందురు?
3. వేగముగా పార్లి ప్రవహించునదేది?



**3.** 30-40 పదాలలో జవాబులు రాయండి.

1. పుష్ప జాతులెన్నియైనను పూజ ఒక్కటే అని ఎట్లు చెప్పగలవు?
2. సహనము కల్గుట కష్టమని కవి ఎట్లు తెలియజేసెను?
3. అల్పుడు పలికినట్లు అధికుడు పలుకడు? ఎట్లు?

**4.** ఖాళీలను పూరించండి.



1. కొరికి చూడ నోరు ............ .
2. కనగ .......... కనకంబ దొక్కటి.
3. పసుల వన్నెలెన్నొ ............ .
4. బహుళ ............ బలుకవచ్చు.
5. వెఱ్ఱివాగు ............ వేగబొర్లి.

**5.** ఎవరు ఎవరితో అనిరి.

1. "సజ్జనులగు వారి సార మిట్లుండురా".
2. "పుష్ప జాతులెన్నొ పూజయొక్కటె".
3. "సహన మొక్కటబ్బ చాల కష్టంబురా".
4. "అల్పుడాడు రీతి సధికుండు నాడునా".

**6.** గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. మిరెపుగింజ చూడ మీద నల్లగ ఉండు.
2. కనగ సొమ్ములెన్నొ కనకంబ దొక్కటి.
3. బహుళ కావ్యములను పరికింపగా వచ్చు.
4. వెఱ్ఱి వాగు పాలు వేగబొర్లి.
5. నిండు నదులు పాఱు నిల్చి గంభీరమై.

**7.** కలిపి రాయండి.

1. సారము + ఇట్లుండు = ........ ; 2. సొమ్ములు + ఎన్నో = ........

3. అది + ఒక్కటి = ........ ; 4. వన్నెలు + ఎన్నో = ........

8. విడదీసి రాయండి.

1. పాలొకటియె = ............ ; 2. పూజయొక్కటి = ............

3. ఒక్కటబ్బు = ............ ; 4. అల్పుడాడు = ............

9. పద్యాలను పూరించండి.

| | |
|---|---|
| 1. మిరెపు గింజ ............ | 2. నిండు నదులు ............ |
| ........................ | ........................ |
| ........................ | ........................ |
| ............ వినురవేమ | ............ వినురవేమ |

10. నానార్థములు :

1. సొమ్ము = ధనము, గోధనము, ఆభరణము
2. జాతి = వర్ణము, ఛందస్సు, పుట్టుక
3. సహనము = ఓర్పు, కాంతి, బలము
4. రీతి = విధము, మర్యాద, వ్యవహారము



11. జతపరచండి.

| | | |
|---|---|---|
| 1. కావ్యముల | ము | పారు నిల్చి గంభీరమై |
| 2. బహుళ శబ్దచయ | లు | పరికింపగా వచ్చు |
| 3. నిండు నదు | ను | పలుక వచ్చు |

ఉ. సూ. : శతకపద్య లక్షణాలను తెలిపి, మరికొంత మంది శతక కవులను పరిచయం చేయండి.

వి. సూ. : శతకపద్యాలను కంఠస్థంచేసి రాగయుక్తంగా పాడటం నేర్చుకోండి.

# 3. చదువు విలువ

- కె. రాజేశ్వరరావు





అనగనగా ఒక ఊళ్ళో
ఉన్నాడొక పిల్లవాడు
ముద్దుచేసి తల్లిదండ్రులు
మురిపెముగా పెంచినారు

చదువంటే శ్రద్ధలేదు
గురువంటే లెక్కలేదు
ఎందుకు చదువని బడికే
ఎగనామం పెట్టినాడు

పిల్లవాని తీరుచూచి
తల్లిమనసు తల్లడిల్లె
చదువు విలువ తెలియజెప్ప
ఉపాయాన్ని యోచించెను.

కోతుల నాడించువాడు
ఒకరోజున వచ్చినాడు
మనిషి చేయగల పనులు
కోతిచేత చేయించెను.

అంతట తల్లికి చక్కని
ఆలోచన తట్టింది.
లోనికెళ్ళి పుస్తకాన్ని
తెచ్చి కోతికిచ్చింది.



కోతి దాన్ని ఎగాదిగా
చూసి చించసాగింది.
కిచకిచమంటూ ఎగురుతూ
కేరింతలు కొట్టింది.

ఇన్ని పనులుచేయు కోతి
చదువెందుకు చదువలేదు
కొడుకు ప్రశ్న విన్న తల్లి
కొడుకుకు ఇట్లు జవాబిచ్చె.

చదువుఉంటె అదికూడా
మనుషులంత గొప్పదే
మనిషికి పశువుకు తేడా
చదువంటా రండుకే

తల్లిమాట విన్న కొడుకు
తలవంచుకు నిలిచినాడు
చదువులోని గొప్పదనము
చక్కగ గ్రహించాడు.





అభ్యాసం :

**1.** అర్థాలు:

ఎగనామం పెట్టుట = వెళ్ళక పోవుట ; తీరు = విధానము ; తల్లడిల్లె = బాధపడె ; యోచించు = ఆలోచించు.

**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. తల్లిదండ్రులు పిల్లవానిని ఏ విధంగా పెంచినారు?
2. పిల్లవాడు బడికి ఎందుకు ఎగనామం పెట్టాడు?



3. కోతుల నాడించువాడు ఏం చేశాడు?
4. కోతిని చూసిన తల్లి ఏం చేసింది?
5. కోతి పుస్తకాన్ని ఏం చేసింది?
6. పిల్లవాడు తల్లిని ఏమని ప్రశించెను?
7. మనిషికి పశువుకి తేడా ఏమిటి?
8. 'చదువు విలువ' గేయంలోని నీతి ఏమి?

**3.** **30-40** పదాలలో జవాబులు రాయండి.

1. పిల్లవాడు ఎట్టివాడు?
2. చదువు విలువ తెలియచెప్పుటకు తల్లి ఏమిచేసెను?
3. కొడుకు ప్రశ్న విన్న తల్లి ఏమని జవాబిచ్చెను?
4. పిల్లవాడు చదువులోని గొప్పదనమును ఏవిధంగా గ్రహించెను?

**4.** ఖాళీలను పూరించండి.

1. అంతట తల్లికి .............. తట్టింది.
2. కోతి దాన్ని ఎగాదిగా చూసి .............. .
3. కోతి ఎగురుతూ .............. కొట్టింది.
4. తల్లిమాట విన్న కొడుకు .............. నిలిచినాడు.
5. చదువులోని .............. చక్కగ గ్రహించాడు.

**5.** ఎవరు ఎవరితో అనిరి

1. "చదువెందుకు చదువలేదు"
2. "చదువు ఉంటె అదికూడ మనుషులంత గొప్పదే"

**6.** సొంత వాక్యాలలో రాయండి.

1. మురిపెంగా   2. ఎగనామం పెట్టుట   3. యోచించి

**7.** వాక్యాంగాలను గుర్తించండి.

1. తల్లి ఒక ఉపాయమును ఆలోచించింది.
2. తల్లిదండ్రులు పిల్లవానిని మురిపెముగా పెంచిరి.
3. కొడుకు తల్లిని ప్రశ్నించాడు.

8. ఏ కాలములో ఉన్నవో రాయండి.

1. కోతి పుస్తకమును చించుతుంది.
2. పిల్లవాడు బడికే ఎగనామం పెట్టాడు.
3. మనిషి చేయగల పనులు కోతిచేత చేయిస్తున్నాడు.

9. కలిపి రాయండి.

1. ఉన్నాడు + ఒక = ____________
2. చదువు + అంటే = ____________
3. లోనికి + ఎళ్ళి = ____________

10. విడదీసి రాయండి.

1. చదువెందుకు = ____________
2. జవాబిచ్చెను = ____________
3. మనుషులంత = ____________
4. అంటారందుకే = ____________

11. కుండలీకరణంలో అడిగిన విధంగా రాయండి.

1. <u>తల్లి</u> మనసు తల్లడిల్లె. (వాచకము)
2. <u>ఆమెకు</u> ఒక ఆలోచన వచ్చింది. (భాషాభాగము)
3. ఇన్ని <u>పనులు</u> చేయు కోతి చదువలేదా? (వచనము)
4. తల్లి పుస్తకమును కోతి<u>కిచ్చెను</u>. (కాలము)



12. వ్యతిరేక పదాలు రాయండి.


1. శ్రద్ధ × ............................
2. ఆలోచన × ............................
3. ప్రశ్న × ............................
4. ఉపాయం × ............................

13. ఏ విభక్తి ప్రత్యయములో రాయండి.

1. కోతి చేత చేయించెను.
2. ఉపాయమును యోచించెను.
3. కొడుకుకు ఇట్లు జవాబిచ్చెను.
4. మనిషికి పశువుకు తేడా ఏమి?
5. చదువులో గొప్పదనము చక్కగా గ్రహించాడు.

14. పర్యాయపదాలు.

1. తల్లి = మాత, జనని, అమ్మ.
2. తండ్రి = జనకుడు, పిత, నాయన.
3. ఉపాయం = అనువు, ఎత్తు, సాధనం.
4. కోతి = కపి, మర్కటము, వానరం.
5. పని = కర్మ, కృత్యము, వ్యాపారం.
6. మనుషులు = మర్త్యులు, నరులు, మనుజులు



ఉ. సూ. : 1. బాలల గేయాలను, గేయ కథలను విద్యార్థులకు పరిచయం చేయండి.
2. విద్యార్థులను గేయాలను రాయటానికి ప్రోత్సహించండి.

వి. సూ. : మీకు నచ్చిన అంశాలపై గేయాలను రాయటానికి ప్రయత్నించండి.



# 4. ఋతువులు


- ఆవుల లక్ష్మి

చిలుకల పలుకులు కోయిల కూతలు
మామిడి పూతలు తుమ్మెద ప్రోతలు
తామర తేనెలు మలయ పవనములు
వనరమ శోభలు వసంత ఋతువున.

ఫెళఫెళ ఎండలు వేడిగాలులు
చెఱువు లెండుటలు బావు లింకుటలు
చెమట పోతలు విసన కర్రలు
ఉస్సురుస్సురులు గ్రీష్మ ఋతువున.

మబ్బుల గుంపులు నెమళ్ళ ఆటలు
ఉఱుములు మెఱుపులు, జోరున వానలు
కప్పల గోలలు, పైరుల ముంపులు
వరదలు, వానలు వానకాలమున.

తెల్ల మబ్బులు, వెన్నెల తేటలు
తెల్లు పూవులు, చల్లని గాలులు
దేవీ పూజలు, దీపావళియును
గిలకల పదములు, శరత్కాలమున.



పొట్టి దినములు, పొడుగు రాత్రులు
ప్రాతఃకాలపు, పొగమంచులును
కుంపటి సెగలు, కంబలి కప్పులు
చలిమంటలు, హేమంత ఋతువున.

కోయిల గొంతులు, సవరించుటలు
దక్షిణ వాయువు, నిద్ర మెళుకువలు
శృంగారించగ, చెట్లు తొందరలు
చిఱుపొగ మంచులు, శిశిరకాలమున.



అభ్యాసం :

1. అర్థాలు.

తుమ్మెదమ్రోతలు = తుమ్మెదలు చేయు ధ్వనులు ; తామరతేనెలు = తామర పూవులందలి తేనె ; మలయ పవనములు = దక్షిణము నుండి వచ్చు గాలులు; ఇంకుట = నీరు లేకుండా ఎండి పోవుట ; మ్రుంపులు = ధ్వనులు.

2. ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. మామిడి పూతలు ఏ కాలంలో కన్పించును?
2. గ్రీష్మకాలమున ఎండలెట్లుండును?
3. హేమంతకాలమున రాత్రింబవళ్ళు ఎట్లుండును?
4. చలిమంటలు ఏకాలమున కాచుకొందురు?
5. చెట్లు శిశిరకాలమున దేనికి తొందరపడును?
6. ఋతువులు ఎన్ని? అవి ఏవి?

**3. 30-40 పదాలలో జవాబులు రాయండి.**

1. వసంతకాల శోభను వివరించుము?
2. గ్రీష్మకాలము ఏవిధంగా ఉండును?
3. వానాకాలమున ప్రకృతి ఎట్లుండును?
4. శరత్కాల వైభవమెట్టిది?
5. హేమంత కాలమును వివరించుము?
6. శిశిర ఋతువున ప్రకృతిలో కలుగు మార్పులేవి?



**4. ఖాళీలను పూరించండి.**

1. మామిడి పూతలు .................... మ్రోతలు.
2. మబ్బుల .................... నెమళ్ళ ఆటలు.
3. ఉఱుములు .................... జోరున వానలు.
4. దేవీ .................... దీపావళియును.
5. శృంగారించగ .................... తొందరలు

**5. ఎవరు ఎవరితో అనిరి.**

1. "తామర తేనెలు మలయపవనములు"
2. "ఉఱుములు మెఱుపులు జోరున వానలు"
3. "ప్రాతఃకాలపు పొగమంచులును"
4. "చిఱుపొగమంచులు, శిశిరకాలమున"

**6. పద్యాలను పూరించండి.**

| | |
|---|---|
| 1. ఫెళఫెళ ........................ | 2. పొట్టి ........................ |
| ........................ | ........................ |
| ........................ | ........................ |
| ............... గ్రీష్మకాలమున | .......... హేమంతకాలమున |

**7. వచనములు మార్చి రాయండి.**

1. చిలుక  2. చెట్టు  3. నెమళ్ళు  4. రాత్రులు

**8.** కింది పదాలలోని విశేషణాలను రాయండి.

**1.** తెల్ల మబ్బులు, **2.** వేడిగాలులు, **3.** జోరునవానలు, **4.** పొట్టి దినములు

**9.** పాఠం/గేయంలోని నామవాచక పదాలను రాయండి.



**10.** కలిపి రాయండి.

1. చెఱువులు + ఎండుట =
2. బావులు + ఇంకుట =

**11.** నానార్థములు

1. తేనెలు = మధువు, పాలు, నెయ్యి.
2. మబ్బు = మేఘము, అజ్ఞానము, చీకటి.
3. వాన = వర్షము, ఏడాది, మబ్బు.
4. శృంగారము = అలంకారం, గంధపుపొడి, సౌందర్యం.



ఉ. సూ. : ఏయే నెలల్లో ఏయే ఋతువులు వస్తాయో విద్యార్థులకు తెలియజేయండి.

## పర్యావరణం-పత్రికలు :

లక్ష్యం : దినపత్రికలూ, ఇతర ప్రతికలూ చర్చిస్తున్న 'పర్యావరణం-కాలుష్యం' సమస్యల గురించి తెలుసుకోవడం.

కార్యక్రమం :

విద్యార్థులు రోజూ పత్రికలు చదివి పర్యావరణ సంబంధిత వార్తలను, వ్యాసాలను, ఛాయాచిత్రాలను గమనించాలి. పత్రికను అందరూ చదివిన తరువాత మరుసటి రోజు వాటిని కత్తిరించి బడికి తీసుకురావచ్చు. పాత పత్రికల్లోంచి గూడా ఇలాంటివి కత్తిరించి పెట్టుకోవచ్చు. వీటన్నింటినీ చార్ట్ పేపర్ పైన గానీ, కార్డ్‌బోర్డ్ పైన కానీ అతికించాలి. వీటి ప్రక్కన అవి ఏ పత్రికలోవో, దానిపేరూ, తేదీ రాయాలి.


స్థానిక పరిస్థితుల గురించి, సమస్యల గురించి వచ్చిన వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీటిని వన్యప్రాణులు, నీరు, చెత్త, కాలుష్యములాంటి విషయాల వారీగా పెట్టవచ్చు. విద్యార్థులందరు చదువగలిగే చోట వీటిని పెట్టాలి. వీటిని పర్యావరణ సమస్యల గురించి చర్చించడానికి, పర్యావరణ సమస్యల పట్ల ప్రజల్ని చైతన్య పర్చడంలో పత్రికల పాత్రను గురించి చర్చించడానికి ఉపయోగించవచ్చు.

వైవిధ్యం/విస్తరణ

- ★ విద్యార్థులు జట్లుగా ఏర్పడి పర్యావరణాన్ని పరిరక్షించే పద్ధతుల గురించి పోస్టర్లు రూపొందించి అతికించవచ్చు.
- ★ విద్యార్థులు స్థానిక పర్యావరణ పరిస్థితుల గురించి పత్రికా సంపాదకులకు ఉత్తరాలు రాయవచ్చు.
- ★ విద్యార్థులు ఆ వాస్యాల, వార్తల ఆధారంగా విద్యార్థుల సమావేశంలో ప్రసంగించవచ్చును.

మూల్యాంకనం :

వార్తల, వ్యాసాల ఆధారంగా పర్యావరణ సమస్యలపై ఒక పట్టిక రూపొందించ మనండి.



# 5. తెలుగు వెలుగు

బి . రాజ్యలక్ష్మి గుప్త



తెలుగు భాష మనదిరా
తెలుగు వెలుగు మనదిరా
దేశ భాషలందున
తెలుగు భాష లెస్సరా ॥తెలుగు॥

ఆదికవి నన్నయ్య
అనువదించి అందించిన
వ్యాస భారతమ్ము మనది
వేదసారమెల్ల మనది ॥తెలుగు॥

ఆంధ్రభోజ కృష్ణరాయ
పొగిడినట్టి దివ్యభాష
లలితమైన భాషరా
రమ్యమైన భాషరా ॥తెలుగు॥


భారతమ్ము మనదిరా
భాగవతము మనదిరా
సర్వధర్మ శాస్త్రాలు
మనవేనని చాటరా! ॥తెలుగు॥

కూచిపూడి నాట్యాలు
చూడ చూడ వేడుకరా
వీధి నాటకాలన్నీ
వేడుకైన వింతలురా ॥తెలుగు॥

స్వచ్ఛమైన భాషరా
స్పష్టమైన భాషరా
సప్త స్వరాగాలతో
రాగయుక్త మీ భాష ॥తెలుగు॥

అమరమైన మనభాష
అంతటను వెలుగునురా
దివ్యభాష మన భాషని
దేశమంత చాటరా!! ॥తెలుగు॥





## అభ్యాసం :

**1.** అర్థాలు :

లెస్స = మంచిది/గొప్పది ; దివ్యభాష = సాటిలేని భాష.



**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. దేశభాషలందు ఏది లెస్స?
2. ఆదికవి ఎవరు?
3. వ్యాసుడు రచించిన గ్రంథమేది?
4. తెలుగు భాషను ఎవరెవరు పొగడిరి?
5. ఏయే గ్రంథాలు మనవని చాటవలెను?
6. ఏ నాట్యాలు చూడవేడుకగా వుండును?
7. మన భాష ఎట్టిదని చాటవలెను?

**3. 30-40** పదాలలో జవాబులు రాయండి.

1. మన కవుల విశిష్టత ఎట్టిది?
2. తెలుగుభాష ఔన్నత్యమెట్టిది?

**4.** ఎవరు ఎవరితో అనిరి

1. "దేశభాషలందున తెలుగుభాష లెస్సరా"
2. "వ్యాస భారతమ్ము మనది"
3. "సప్త స్వరాగాలతో రాగయుక్త మీ భాష"

**5.** కలిపి రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| 1. భాషలు | + | అందున | = | ________ |
| 2. సారము | + | ఎల్ల | = | ________ |
| 3. వేడుక | + | ఐన | = | ________ |
| 4. స్వచ్ఛము | + | ఐన | = | ________ |

6. విడదీసి రాయండి.

1. స్పష్టమైన = ..........................
2. రాగయుక్తమైన = ..........................
3. అమరమైన = ..........................
4. దేశమంత = ..........................

7. గీత గీసిన పదాలు ఏ భాషా భాగాలో రాయండి.



1. ఆదికవి <u>నన్నయ్య</u>.
2. పొగడినట్టి <u>దివ్య</u> భాష.
3. మనవేనని <u>చాటరా</u>.
4. <u>లలితమైన</u> భాషరా.
5. వ్యాసభారతమ్ము <u>మనది</u>.

8. సొంత వాక్యాలలో రాయండి.

1. అందించు 2. రమ్యము 3. అనువదించు

9. వ్యతిరేక పదాలు రాయండి.

1. పొగడు × .........., 2. ధర్మము × ..........,
3. స్వచ్ఛము × .........., 4. స్పష్టము × ..........,

10. పద్యాలను పూరించండి.

1. ఆదికవి ..........................
..........................
..........................
.......................... మనది

2. స్వచ్ఛమైన ..........................
..........................
..........................
.......................... మీ భాష

11. ప్రకృతి - వికృతి

| | | |
|---|---|---|
| 1. భాష | - | బాస |
| 2. శాస్త్రము | - | చట్టము |
| 3. నాట్యము | - | నట్టువ |
| 4. ధర్మము | - | దమ్మము |

12. ఏ విభక్తి ప్రత్యయములో రాయండి.

1. దేశభాషలందున తెలుగుభాష లెస్సరా. ..................

2. సప్త స్వరాగాలలో రాగయుక్త మీ భాష. ..................

3. అంతటను వెలుగునురా. ..................

విశేషాంశాలు :

1. సప్త స్వరాలు (సర్వములు) :

స - షడ్జము, రి - రిషభము, గ - గాంధారము, మ - మధ్యమము, ప - పంచమము, ద - దైవతము, ని - నిషాదము

2. వేదములు : 1. ఋగ్వేదం 2. యజుర్వేదం 3. సామవేదం 4. అథర్వణవేదము

3. వ్యాసభారతము : వేదవ్యాసరచితము 18 పర్వములు, లక్షశ్లోకములతో పంచమ వేదంగా భాసించునది. నీతిశాస్త్రము, భగవద్గీత, విష్ణు సహస్రనామము, లౌకిక, అలౌకిక విషయాలు ఇందలి ముఖ్యాంశాలు.

4. భాగవతము : కృష్ణరూప భగవంతుని చరితము గల గొప్ప పురాణ గ్రంధము.

5. వీధి నాటకాలు : ఇవి సంగీత నృత్యాలతో కూడిన నాటకాలు. ఇందులోని పాత్రలన్ని తమను తామే పరిచయం చేసుకుంటూ రంగ ప్రవేశం చేస్తాయి. వీటినే బయలాట అని కూడా పిలుస్తారు.

ఉ. సూ. : 1. 'తెలుగు'భాషకు లభించిన ప్రాచీనహోదా గురించి విద్యార్థులకు తెలియజేయండి.

2. 'దేశభాషలందు తెలుగు లెస్స', ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అను నానుడులను గూర్చి విద్యార్థులకు వివరించండి.

# 6. శతక పద్యాలు

మారద వెంకయ్య

ఒక్కడెచాలు నిశ్చలబలోన్నతుడెంతటి కార్యమైనదా
జక్కనొనర్చ గౌరవుల సంఖ్యులు పట్టిన ధేను కోటులం
జిక్కగ నీక తత్త్రు బలసేన ననేక శిలీ ముఖంబులన్
మొక్క వడంగ జేసి తుదముట్టడె యొక్క కిరీటి భాస్కరా.

చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతు లెవ్వరు మెచ్చ రెచ్చుటం
బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం
పొందవెడు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా.

దానము సేయగోరిన వదాన్యున కీయగ శక్తిలేనిచో
నైన బరోపకారమునకై యొక దిక్కున దెచ్చియైన నీ
బూనును మేఘు డంబుధికి బోయి జలంబుల దెచ్చి యీయడే
వాన సమస్త జీవులకు వాంఛిత మింపెసలార భాస్కరా.

## అభ్యాసం :

### 1. అర్థ తాత్పర్యాలు :

1. భాస్కరా! నిశ్చల = చలింపని ; బల = బలము చేత ; ఉన్నతుడు = గొప్పవాడు ; చాలున్ = చాలును ; ఒనర్పన్ = చేయుటకు ; ఒక్కకిరీటి = ఒక్క అర్జునుడు ; అసంఖ్యులు = లెక్కలేని మంది ; పట్టిన ధేను కోటులన్ = పట్టుకొనిన యాలమందలు ; చిక్కగన్ + ఈక = దొరకనీయక ; తత్ + ప్రబలసేన = ఆ కౌరవుల యొక్క గొప్ప సైన్యమును ; అనేక శిలీ ముఖంబులను = పెక్కు బాణములచేత ; మొక్కవడంగ చేసి = ఓడినట్లు చేసి ; తుదముట్టడె = అంతమొనర్పడె? (నశింపచేయును)

   తాత్పర్యము : దుర్యోధనాదులు గొప్ప సైన్యముతో విరటుని యాలమందను తోలుకొని పోవుచుండగా అర్జునుడొక్కడే అనేక బాణములచే వారలను జయించి గోవులను వారి వశముగానీయక మరలించుకొని వచ్చెను. అటులనే స్థిరమైన బలవంతుడు తానెంతటి కార్యమునైనను నెరవేర్పగలడు.

2. భాస్కరా! రసజ్ఞత = సారము నెరుగుట ; ఇంచుక = కొంచెము ; నిరర్థకంబు = పనికిమాలిన దగు ; ఎచ్చటన్ = ఎచ్చటనైనను ; గుణసంయుతులు = మంచి గుణములు గలవారు ; పదునుగన్ = తగినట్లుగా ; నలపాకమున్ = నలచక్రవర్తి చేయు వంట వంటి వంటను ; అందున్ = అందులో ; ఇంపు + ఒదవెడున్ = చక్కని రుచిని పుట్టించు ; పుట్టగన్ + నేర్చున్ + అటయ్య = కలుగునా? (కలుగదు)

   తాత్పర్యము : మానవుడెంత చదివినా, కొంచెమైననూ రసజ్ఞత లేకపోతే ఆచదువు వ్యర్థం. చదువులో గల సారాన్ని గ్రహించాలి. అప్పుడే ఆ చదువును అందరూ మెచ్చుకుంటారు. అటులనే మంచికూర నలపాకం చేసినా అందులో ఉప్పు వెయ్యనిచో కూరకు రుచిరాదు. ఎవ్వరూ తినరు. ఉప్పులేని కూర ఎంత బాగా వండినా రుచిగా ఉండదు.

3. చేయన్ = చేయుటకు ; కోరిన వదాన్యునకున్ = ఇష్టమున్న దాతకు ; ఈయన్ + కన్ = ఇచ్చుటకు ; శక్తిలేనిచోన్ + జనన్ = సామర్థ్యము లేనప్పటికిని ; పరోపకారమునకై = ఇతరులకు మేలు చేయుటకై ; ఒక దిక్కునన్ = ఇంకొక చోటను ; ఈన్ = ఇచ్చుటకు ; పూనును = ప్రయత్నము చేయును ; అంబుధికిన్ = సముద్రమునకు ; జలంబులన్ = నీటిని తెచ్చి ; సమస్త జీవులకున్ = అన్ని జంతువులకు ; వాంఛితము = కోరిక ; ఇంపెసలు + ఆరన్ = తృప్తి కలుగునట్లుగా ; ఈయఁడె = ఒసగడా? (ఒసగును)

తాత్పర్యము : మబ్బు తనయొద్ద జలము లేనప్పుడు సముద్రమునకు బోయి జలమును దెచ్చి యన్ని ప్రాణులకు తృప్తి కలుగునట్లు వర్షించును. అట్లే ధర్మము చేయుట కిష్టపడిన దాత తనయొద్ద దానము చేయుటకు శక్తిలేనిచో పరోపకారమునకై నింకొక చోటనైన తెచ్చియిచ్చు చుండును.

2. ఒక వాక్యంలో జవాబులు రాయండి.
   1. విరటుని ఆలమందను ఎవరు తోలుకొని పోయిరి?
   2. ఎట్టి చదువు నిరర్థకము?
   3. వదాన్యుడెట్టి వాడు?
3. 30-40 పదాలలో జవాబులు రాయండి.
   1. బలవంతుడు ఎంతటి కార్యాన్నైనా సాధించగలడని కవి ఎట్లు చెప్పెను?
   2. ఎట్టివానికైనా రసికత అవసరమని కవి ఎట్లు తెల్పెను?
   3. వదాన్యుని విశిష్టత ఎట్టిది?
4. ఎవరు ఎవరితో అనిరి.
   1. "ఒక్కఁడెచాలు నిశ్చల బలోన్నతుఁడు".
   2. "గుణసంయుతు లెవ్వరు మెచ్చరు".
   3. "మేఘు డంబుధికి బోయి జలంబుల దెచ్చి యీయఁడే".

5. విడదీసి రాయండి.

1. బలోన్నతుడు = ______
2. సంయుతులెవ్వరు = ______
3. మేఘుడంబుధి = ______
4. చాలకున్న = ______
5. పదాన్యున కీయగ = ______

6. కలిపి రాయండి.

1. చదువు + అది = ______
2. పర + ఉపకారము = ______
3. ఇంపెసలు + ఆర = ______
4. మెచ్చరు + ఎచ్చట = ______
5. చేసినన్ + ఐన = ______
6. కార్యము + ఐన = ______

క్రిస్మస్ పండుగను గూర్చి పది వాక్యాలు రాయండి.





# 1. గోరింక తెలివి

(ఒక వ్యాపారి మాట్లాడే గోరింకను తెచ్చి పంజరంలో ఉంచాడు. ప్రేమగా చూసుకుంటూ దాని మాటలకు మురిసిపోతూ వుండేవాడు. ఒకరోజు సరుకులు తేవడానికి పట్నానికి వెళ్తూ భార్యతో...)



వ్యాపారి : నీకేం తీసుకురావాలి?

భార్య : మట్టి గాజులు తీసుకురండి.

వ్యాపారి : అమ్మాయీ! నీకేం కావాలి?

అమ్మాయి : పలక, రిబ్బన్లు.

వ్యాపారి : అబ్బాయీ! నీకేం కావాలి?

అబ్బాయి : బంతి, కథల పుస్తకాలు

వ్యాపారి : గోరింకా! నీకేం కావాలి? పండ్లేనా?

గోరింక : కాదు. పట్నం వెళ్ళేదారిలో నా మిత్రులు కనబడితే మీ మిత్రుడు పంజరంలో ఉన్నాడని వారితో చెప్పండి.

(వ్యాపారి, అతని మిత్రులు కలిసి పట్నానికి బయలుదేరారు. దారిలో ఒక చెట్టుకింద విశ్రాంతి తీసుకున్నారు. ఇంతలో చెట్టుపై నున్న కొన్ని గోరింకల సవ్వడి వినబడింది. వ్యాపారి తన గోరింక సందేశాన్ని వాటికి వినిపించాడు. అది విన్న ఒక ముసలి గోరింక కన్నీళ్ళు కార్చింది. విలవిలలాడుతూ వ్యాపారి కాళ్ళ దగ్గర పడిపోయింది. వ్యాపారి దాన్ని కదిపిచూసి అది చనిపోయిందని అర్థం చేసుకున్నాడు. పట్నంలో తన పని చూసుకొని ఇల్లు చేరాడు.)

గోరింక : బాబు గారూ! నా మిత్రుల నెవరినైనా కలిశారా! నా సందేశాన్ని అందచేశారా!

వ్యాపారి : ఆ... ఆ... నీ సందేశాన్ని అందించాను. అది విన్న ఒక ముసలి గోరింక ఏడ్చింది. విలవిలలాడుతూ నా కాళ్ళ దగ్గర పడిపోయింది. అది చనిపోయిందనుకుంటున్నాను.



(ఇది వినగానే పంజరంలోని గోరింక రెక్కలు టపటపలాడిస్తూ కళ్ళు తేల వేసింది. పంజరంలో కదలిక లేకుండా పడిపోయింది. వ్యాపారికి ఆశ్చర్యం వేసింది. ఎంతో బాధపడుతూ, పంజరం తలుపు తెరిచి దానిని బయటకు తీశాడు. వెంటనే గోరింక రివ్వున చెట్టుపైకి ఎగిరి పోయింది.)



వ్యాపారి : (కోపంగా) అరే! ఇదేంటి! ఇలా చేశావు?

గోరింక : ముసలి గోరింక వ్యవహారం మీకు అర్థం కాలేదుకదా! అది నిజానికి చనిపోలేదు. "నీకు స్వేచ్ఛ కావాలంటే నాలాగా చనిపోయినట్లు నటించు" అనే సందేశాన్ని తెలియచేసింది.

వ్యాపారి : నేను నిన్ను ఎంతో ప్రేమగా చూసుకున్నాను కదా! మరి ఇలా ఎందుకు చేశావు?

గోరింక : స్వేచ్ఛ లేక సుఖమెక్కడుంది? అందుకే అలా చేశాను.

(తన గారాబాల గోరింక మనస్సు అర్థం చేసుకున్న అతను ఇంకెప్పుడు ఏ ప్రాణిని బంధించకూడదని వ్యాపారి నిర్ణయించుకున్నాడు.)

## అభ్యాసం :

**1.** అర్థాలు:

సవ్వడి = చప్పుడు, శబ్దము ; సందేశము = చెప్పిపంపిన మాట ; మురిసిపోతూ = ఆనందిస్తూ ; విలవిలలాడుతూ = బాధపడుతూ ; కదిపి = కదిలించి.

**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. భార్య వ్యాపారిని ఏమి తీసుకురమ్మనెను?
2. వ్యాపారితో అమ్మాయి ఏమి కావాలన్నది?
3. అబ్బాయి తండ్రిని ఏం కోరాడు?
4. గోరింక తన మిత్రులకు ఏమి చెప్పమనెను?
5. గోరింక సందేశం విన్న ముసలి గోరింక ఏం చేసింది?
6. గోరింక తాను ఎగిరిపోవడానికి కారణమేనని వ్యాపారికి తెలియచేసింది?
7. గోరింక మనస్సు అర్థం చేసుకున్న వ్యాపారి ఏమని నిర్ణయించుకున్నాడు?

**3.** **30-40** పదాలలో జవాబులు రాయండి.

1. వ్యాపారి గోరింక సందేశాన్ని దాని మిత్రుల కేవిధంగా అందించాడు? అప్పుడేం జరిగింది?
2. ముసలి గోరింక వ్యవహారాన్ని విన్న గోరింక ఏం చేసింది?
3. కోపించిన వ్యాపారితో గోరింక ఏమని పలికింది? దాని ఫలితమేమి?

**4.** ఎవరు ఎవరితో అనిరి

1. "నీకేం కావాలి? పండ్లేనా!"
2. "నా మిత్రుల నెవరినైనా కలిసారా!"
3. "విలవిలలాడుతూ నా కాళ్ళ దగ్గర పడిపోయింది."
4. "ఇదేంటి! ఇలా చేశావు."
5. "స్వేచ్ఛ లేక సుఖ మెక్కడుంది."

5. కలిపి రాయండి.

1. నీకు + ఏమి = ______________________
2. సుఖము + ఎక్కడ = ______________________
3. ఇంక + ఎప్పుడు = ______________________
4. చనిపోయిన + అట్లు = ______________________
5. చెట్టుపైన + ఉన్న = ______________________

6. విడదీసి రాయండి.

1. ఉన్నాడని = ______________________
2. ఇదేంటి = ______________________
3. కావాలంటే = ______________________
4. ఎవరికైనా = ______________________
5. బంధించకూడదని = ______________________

7. కుండలీ కరణములలో అడిగిన విధంగా రాయండి.

1. వ్యాపారి అతని మిత్రుడు కలిసి పట్నానికి బయలు దేరారు. (వచనము)
2. ముసలి గోరింక వ్యాపారి కాళ్ళ దగ్గర పడిపోయింది. (భాషాభాగం)
3. వ్యాపారి దాన్ని కదిపి చూశాడు. (భాషాభాగం)
4. నేను నిన్ను ఎంతో ప్రేమగా చూసుకున్నాను. (పురుష)
5. మీకు అర్థం కాలేదా! (పురుష)
6. నీకు స్వేచ్ఛ కావాలా! (పురుష)
7. మట్టిగాజులు తీసుకురండి. (వాచకము)

8. సొంత వాక్యాలు రాయండి.

1. విలవిలలాడు 2. కన్నీళ్ళుకార్చు

9. కాలాలు రాయండి.

1. వ్యాపారి పట్నానికి బయలుదేరబోతున్నాడు.
2. చెట్టుపై కొన్ని గోరింకల సవ్వడి వినబడింది.
3. గోరింక రివ్వున చెట్టుపైకి ఎగిరిపోయింది.

**10.** వాక్యాంగాలు రాయండి.

1. వ్యాపారి గోరింకను తెచ్చాడు.
2. అబ్బాయి కథల పుస్తకాలను కావాలన్నాడు.
3. వ్యాపారి గోరింకను ప్రేమగా చూసుకున్నాడు.

**11.** గుర్తింపబడిన ప్రత్యయములు ఏ విభక్తులో రాయండి.

1. గోరింకను తెచ్చి పంజరంలో ఉంచాడు.
2. మిత్రుడు పంజరంలో ఉన్నాడని వారితో చెప్పండి.
3. గోరింక సందేశాన్ని వాటికి వినిపించాడు.
4. ఏ ప్రాణిని బంధించకూడదు.



ఉ. సూ. : 1. గేయము, కథ, నాటిక ఈ సాహిత్య ప్రక్రియల రచనా వైవిధ్యాన్ని విద్యార్థులకు వివరించండి.

2. వివిధ పాఠ్యాంశాలను విద్యార్థులచే నాటికల రూపంలో ప్రదర్శింప చేయండి

# రైతు నిజాయితీ

మరాఠా సైన్యానికి బాజీరావు పీష్వా సర్వసైన్యాధ్యక్షుడు. ఓసారి ఆయన యుద్ధంలో విజయం సాధించి తన రాజ్యానికి తిరిగి వస్తున్నాడు. దారిలో అలసిపోయి ఓ చోట శిబిరం ఏర్పాటు చేసుకున్నాడు. అయితే అది ఊరికి చాలా దూరంగా ఉన్న ప్రాంతం. తినడానికి తెచ్చుకున్నవి అయిపోవడంతో ఏం చేయాలో తోచక సైనికులు ఆ విషయాన్ని పీష్వాకు చెప్పారు. అప్పుడు పీష్వా దగ్గరలోని ఏదయినా తోటలో పండ్లు కోసుకుని రమ్మని చెప్పాడు. దాంతో కొందరు సైనికులు బయలు దేరారు.

అలా వెళుతుండగా వారికి ఓ తోటలో ఒకరైతు కనిపించాడు. సైనికులు అతడి వద్దకు వెళ్ళి విషయం చెప్పారు. అప్పుడు ఆయన వాళ్ళతో 'మీకో పెద్దతోట చూపిస్తాను రండి' అని తన వెంట తీసుకువెళ్ళాడు.



నిండా పండ్లున్న తోట దగ్గరకు వెళ్ళాక 'ఈ తోట వద్దు. మరో తోట చూపిస్తాను' అని అన్నాడు. దాంతో వారికి కోపం వచ్చింది. అయినా మరో తోట చూపిస్తానంటున్నాడుగా అని అతడి వెనక వెళ్ళారు. కొంతదూరం వెళ్ళాక ఓ చిన్న తోటను చూపించి 'దీంట్లో పండ్లు కోసుకోండి' అన్నాడు. ఈ సారి సైనికులకు బాగా కోపం వచ్చింది. 'అంత పెద్ద తోటను వదిలి దీన్ని చూపిస్తావా? ఆ తోట నీదై ఉంటుంది. అందుకే ఇంకెవరిదో చూపించి నీ తోటను కాపాడుకుందామనుకుంటున్నావా?' అంటూ అతడిని పీష్వా దగ్గరకు తీసుకువెళ్ళారు.

సైనికుల ద్వారా విషయం తెలుసుకున్న పీష్వా 'ఎందుకిలా చేశావు?' అని అడిగాడు. 'ప్రభూ.... మొదట చూపించిన తోట నాదికాదు. నాది కానప్పుడు దాన్ని దానం చేసే హక్కు నాకు ఎక్కడ ఉంటుంది? రెండోసారి చూపించింది నాదే. అందుకే ఇవ్వడానికి సిద్ధపడ్డాను' అని చెప్పాడు. అతడి నిజాయితీకి పీష్వా మెచ్చుకున్నాడు. అతడి పంట తీసుకుని దాని విలువకు సమానమయిన బంగారాన్నిచ్చి పంపించాడు.

ప్రశ్నలు :

1. బాజీరావు ఎవరు?
2. పీష్వా సైనికులకు ఏమి చెప్పాడు?
3. రైతు పెద్దతోటను చూపి ఏమన్నాడు?
4. రైతు పీష్వాతో ఏమని చెప్పాడు?




బాజీరావు పీష్వా తపాల బిళ్ళ

# 2. మూడు అమూల్యాభరణాలు



బెంగాల్ రాష్ట్రంలోని మేదినీపూర్ జిల్లాలోని ఒక పల్లెటూరు వీరసింహ. ఆ గ్రామంలో ఒక బీద కుంటుంబం. తల్లి, కొడుకు మాత్రం ఉన్నారు. తల్లిపట్ల అత్యంత భక్తి కలవాడా బాలుడు.

ఒకమారు ఆ గ్రామంలో తిరునాళ్ళ సందర్భంగా పెద్ద ఊరేగింపు సాగింది. గ్రామంలోని స్త్రీలు విలువైన చీరలు, నగలు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. బీదరాలి వద్ద విలువైన చీరలు లేవు. నగలూ లేవు. అందుకు బాలుడు ఎంతో బాధపడ్డాడు.

ఆ బాలుడు పెరిగి పెద్దవాడయ్యాడు. విద్వాంసుడని పేరు సంపాదించాడు. ఉద్యోగంలో చేరాడు. ఒకరోజు తల్లి వద్దకు వెళ్ళి "అమ్మా ఇప్పుడు మన పరిస్థితి మెరుగైంది. నీకు కొన్ని నగలు చేయించాలని నిశ్చయించు కొన్నాను. నీకేవి కావాలో చెప్పు" అన్నాడు.

"బాబూ! నగలంటే ఆశలేని వారెవరుంటారయ్యా? ఆడవాళ్ళు నగల కోసం ఉవ్విళ్ళూరు తుంటారు. నీ ఆలోచన బాగుంది. అలాగే చేయిద్దువు" అన్నది.

"అయితే ఏం చేయించాలో చెప్పు స్వర్ణకారుణ్ణి పిలుచుకొని వస్తా" అన్నాడా కుమారుడు. కాసేపు ఆలోచించి "బాబూ! చాలా కాలంగా మూడు ఆభరణాలు కావాలన్న కోరిక ఉంది".

"అయితే ఎందుకమ్మా ఇన్నాళ్ళుగా చెప్పలేదు. ఎప్పుడో చేయించేవాణ్ణి కదమ్మా! అన్నాడు.

"అలాగా బాబూ సంతోషం. అయితే నేను కోరే ఆభరణాలు చాలా విలువైనవి. అంత స్తోమత నీకు లేదనుకొని మౌనంగా ఉండిపోయాను ఇంతకాలం.

"ఎంత ఖర్చు అయినా సరే తప్పక చేయిస్తాను చెప్పమ్మా. ఈ రోజే తగు ఏర్పాటు చేస్తా".

తల్లి నవ్వింది. కొడుకును చేరదీసి తల నిమురుతూ ఎంతో ఆప్యాయంగా 'బాబూ! ఆభరణాలు అలంకరించుకునే కాలం ఎప్పుడో పోయింది. జీవిత అంతిమ దశలో ఉన్నాను. కాని చాలా కాలంగా మూడు ఆభరణాల పట్ల ఆశ ఉంది అన్నది.

ఏం చేయించాలో చెప్పు వీలైనంత త్వరలో చేయిస్తా అన్నాడు. "వెండి, బంగారం, ముత్యాలు, రత్నాల నగల పట్ల నాకేనాడూ మోజు లేదు కాని బాబూ, నీవు పుట్టిన ఈ ఊళ్ళో ఒక పాఠశాల లేదు, మంచి పాఠశాల కట్టించు" అదే నాకు కావలసిన మొదటి ఆభరణం.

"రోగుల దుస్థితి చూస్తూ ఉన్నావు. వారికోసం ఒక వైద్యశాల ఏర్పాటు చేయించు. అది నాకు కావలసిన రెండవ ఆభరణం".

"ఈ ప్రాంతంలో చాలా మంది అనాథ బాలబాలికలు ఉన్నారు. వారికి తిండి, వసతి, చదువుకు తగు ఏర్పాటు చేయించు' అదే నాకు కావలసిన మూడవ ఆభరణం. ఇవే నా మూడు అమూల్యాభరణాలు అన్నదా తల్లి.

కుమారుని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తల్లికి నమస్కరించి "అమ్మా నన్ను ఆశీర్వదించు. ఈ మూడు ఆభరణాలను త్వరలోనే సమకూర్చేందుకు ప్రయత్నిస్తాను" అన్నాడు.

ఆ తల్లి పేరు భగవతీదేవి. ఆమె కుమారుడే విఖ్యాత విద్వాంసుడైన పండిత ఈశ్వర చంద్ర విద్యాసాగరుడు.

వీరసింహ గ్రామంలో మొదటి పాఠశాల ప్రారంభమైనది. క్రమంగా వైద్యశాల, అనాథశరణాలయం ప్రారంభింపబడినాయి.

నేటికీ వీరసింహ గ్రామంలో ఆ అమూల్యాభరణాలు తమ కథ చెబుతాయి.

## అభ్యాసం :

**1. అర్థాలు :**

అత్యంత = మిక్కిలి ; విద్వాంసుడు = పండితుడు ; మెరుగుపుట = బాగుపడుట ; స్వర్ణకారుడు = బంగారు, వెండి నగలు చేయువాడు, కంసాలి ; ఆభరణాలు = నగలు ; దుస్థితి = చెడుదైన అవస్థ ; అమూల్యము = విలువైన.

**2. ఒక వాక్యంలో జవాబులు రాయండి.**

1. వీరసింహ గ్రామంలో ఊరేగింపు ఎందుకు జరిగింది?
2. బాలుడు తల్లిని ఏమని ప్రశ్నించాడు?
3. తల్లి కుమారుని ఏమని కోరింది?
4. వీరసింహ గ్రామంలో ఏమేమి ప్రారంభింపబడినాయి?

**3. 30-40 పదాలలో జవాబులు రాయండి.**

1. బాలుడు ఎందుకు బాధపడ్డాడు?
2. బాలుడు తల్లికి నగలూ, చీరలు లేవని బాధపడుతూ ఏమన్నాడు?
3. తల్లి కొడుకుతో ఆప్యాయంగా ఏమన్నది?
4. మూడు అమూల్యాభరణాల గూర్చి తల్లి ఏమని వివరించింది?

4. ఎవరు ఎవరితో అనిరి.

1. "నీకు కొన్ని నగలు చేయించాలని నిశ్చయించుకున్నాను".
2. "నీ ఆలోచన బాగుంది".
3. "అయితే ఏం చేయించాలో చెప్పు".
4. "మూడు ఆభరణాలు కావాలన్న కోరిక ఉంది".
5. "ఎందుకమ్మా ఇన్నాళ్ళుగా చెప్పలేదు".
6. "మంచి పాఠశాల కట్టించు".
7. "నన్ను ఆశీర్వదించు".

5. ఏ వాచకమో రాయండి.

1. బాలుడు 2. తల్లి 3. స్వర్ణకారుడు 4. ఆభరణము
5. కొడుకు 6. విద్వాంసుడు 7. భగవతీదేవి.

6. గీత గీసిన పదాలు ఏ పురుషలో రాయండి.

1. వాడు పెరిగి పెద్దవాడు అయ్యాడు.
2. నీకు కొన్ని నగలు చేయిస్తాను.
3. నీవు పుట్టిన ఊళ్ళో పాఠశాల లేదు.
4. వారికోసం పాఠశాల ఏర్పాటు చెయ్యి.
5. అమ్మా నన్ను ఆశీర్వదించు.

7. ఏ విభక్తి ప్రత్యయాలో రాయండి.

1. స్త్రీలు ఊరేగింపులో పాల్గొన్నారు.
2. ఆడవాళ్ళు నగల కొఱకు ఉవ్విళ్ళూరుతుంటారు.
3. తల్లికి నమస్కరించాడు.

ప్రాయోగిక వ్యాకరణము

8. కింది వాక్యాల్ని గమనించండి.

1. గ్రామంలో ఊరేగింపు సాగింది.

పై వాక్యాలలో 'సాగింది' , 'జన్మించాడు' అనే క్రియా పదాలున్నాయి. ఈ విధంగా ఒకే క్రియా పదం ఉన్న వాక్యాలను సామాన్య వాక్యాలందురు.

కింది వాక్యాల్ని గమనించండి.

1. తల్లి వద్ద విలువైన చీరలు లేవు. అందుకు బాలుడు ఎంతో బాధపడ్డాడు.
2. స్త్రీలు విలువైన చీరలు, నగలు ధరించారు.

1. పై వాక్యాలలో మొదటి దానియందు 'అందుకు' అనే పదం రెండు సామాన్య వాక్యాలను కలుపుచున్నది. అందువలన దీనిని సంయుక్తవాక్యం అందురు.

2. రెండవ వాక్యంలో క్రియా పదం ఒకటే అయిననూ దానిని రెండు వాక్యములకు చెప్పవచ్చును. అనగా

స్త్రీలు విలువైన చీరలు ధరించారు.
స్త్రీలు విలువైన నగలు ధరించారు

ఇట్టి వాక్యాలను కూడా సంయుక్త వాక్యాలందురు.



ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గృహము

ఉ. సూ. : నైతిక విలువల ప్రాధాన్యతను విద్యార్థులకు విశదీకరించండి.

వి. సూ. : నైతిక విలువల విశిష్టతను గుర్తించి వాటిని అలవరచుకొండి.

# 3. గోకులాష్టమి

హిందువులు జరుపుకొనే పండుగలలో 'గోకులాష్టమి' ఒకటి. శ్రావణ బహుళ అష్టమినాడు అర్ధరాత్రి యదువంశంలో దేవకీ, వసుదేవుల పుత్రునిగా శ్రీకృష్ణుడు జన్మించాడు. ఈ పర్వదినాన్ని హిందువులు గోకులాష్టమి పండుగగా జరుపుకుంటారు.

ఈ రోజు వేకువ జామునసే లేచి కాలకృత్యాలు తీర్చుకొని తులసీదళాలు (తులసీ ఆకులు) వేసిన చన్నీటితో స్నానం చేస్తారు. ఇల్లు వాకిలి శుభ్రం చేసుకొని రంగురంగుల తోరణాలతో అలంకరిస్తారు. పగలు ఉపవాసం ఉండి పూజా కార్యక్రమాలు జరుపుతారు. చిన్నికృష్ణుడి విగ్రహాన్ని ఉయ్యాలలో పెట్టి ఊపుతూ రకరకాల పూలతో పూజిస్తారు. కృష్ణపాదాలు వేసి పాలు, పెరుగు, మీగడ, వెన్న, చెఱుకు పానకం నైవేద్యంగా పెడతారు.





ఆనాటి ప్రజలు ఈ శుభ సందర్భంగా ఉట్లుకొట్టేవారు. అనాదిగా వస్తున్న ఈ ఆచారాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు. ఉట్లు కొట్టడం చాలా ఆనందంగా, సరదాగా ఉంటుంది. ఊర్లో మందిరం దగ్గరలోని ఒక కూడలిలో ఎత్తుగా ఉట్టిని కడతారు. దానిలో పెరుగువేసిన కుండ దానిపై కొబ్బరికాయ పెడతారు. ఉట్టి తాటిని లాగుతూ ఉండగ ఎగిరి కర్రతో కొడతారు.

ముంబయిలో ఉట్ల పండుగను చూచి తీరాల్సిందే. పెరుగుతో నిండిన కుండను చక్కగా అలంకరిస్తారు. ఒక కొబ్బరి కాయను దానిపై పెడతారు. పెద్ద పెద్ద భవనాల మధ్య అలంకరించిన తాడుతో కుండను కడతారు. ఆ తాడుకు మధ్య మధ్యలో రకరకాల ఫలాలు, డబ్బులు కూడా కడతారు. యువకులు గుంపులు గుంపులుగా చేరతారు. వలయాకారంగా నిలబడి ఒకరి భుజంపై ఒకరు ఎక్కుతూ గోపురం కడతారు. గోపురంపైన నిలబడినవాడు ఉట్టి మీది కుండను కొబ్బరికాయతో పగులకొడతాడు. ఆ తర్వాత అందరూ ఆలారే ఆలా.... గోవిందా ఆలా.... అని పాడుతూ గంతులు వేస్తూ ఆనందంగా మరొక కూడలి వద్దకు వెళతారు. దీనినే మహారాష్ట్రీయులు 'దహీహండీ' అని అంటారు. అల్లరి కృష్ణుని వేడుకలతో జరిగే ఈ పండుగ అందరికీ వేడుకగా, వినోదంగా ఉంటుంది.

## అభ్యాసం :

**1.** అర్థాలు :

వేకువజామున = ఉదయమున, తెల్లవారకముందు ; వలయాకారంగా = గుండ్రంగా ; నైవేద్యం = దేవునికి చేయు ఆరగింపు.



**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. శ్రీకృష్ణుని తల్లిదండ్రులెవరు?
2. శ్రీకృష్ణుడు ఎప్పుడు జన్మించాడు?
3. గోకులాష్టమిని ఎప్పుడు జరుపుకుంటారు?
4. గోకులాష్టమినాడు శ్రీకృష్ణుని ఏ విధంగా పూజిస్తారు?
5. శ్రీకృష్ణునికి ఏవేవి నైవేద్యంగా పెడతారు?

**3.** 30-40 పదాలలో జవాబులు రాయండి.

1. గోకులాష్టమిని ఏ విధంగా జరుపుకుంటారు?
2. ప్రాచీనకాలం నుంచీ వస్తున్న ఉట్లు కొట్టే విధానాన్ని వివరించండి.
3. మహారాష్ట్రీయులు 'దహీహండీ'ని ఏ విధంగా జరుపుకుంటారు?
4. మీకు నచ్చిన పండుగను గురించి రాయండి.

**4.** ఖాళీలను పూరించండి.

1. దేవకీ వసుదేవుల పుత్రుడుగా .................... జన్మించాడు.
2. పగలు .................... ఉండి పూజా కార్యక్రమాలు జరుపుతారు.
3. ఒక కూడలిలో ఎత్తుగా .................... కడతారు.

**5.** ఏ వాచకమో రాయండి.

1. పుత్రుడు   2. దేవకి   3. ఆకు   4. యువకులు   5. ఉట్టి

**6.** గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. హిందువులు జరుపుకునే పండుగలలో గోకులాష్టమి ముఖ్యమైనది.
2. పెద్దపెద్ద భవనాల మధ్య ఉట్టిని కడతారు.

3. పెరుగుతో నిండిన కుండను చక్కగా అలంకరిస్తారు.
4. ఎత్తుగా ఉట్టిని కట్టి దానిలో కొబ్బరికాయ పెడతారు.

**7.** సామాన్య, సంయుక్త వాక్యములను గుర్తించి రాయండి.

1. పాలు, పెరుగు, మీగడ నైవేద్యంగా పెడతారు.
2. శ్రీకృష్ణుడు యదువంశంలో జన్మించాడు.
3. త్రాడుకు మధ్యలో రకరకాల ఫలాలు, డబ్బులు కడతారు.
4. పెరుగుతో నిండిన కుండను చక్కగా అలంకరిస్తారు.

**8.** గీతగీసిన పదాల వచనాన్ని మార్చి, వాక్యాన్ని తగిన విధంగా రాయండి.

ఉదా : వాడు కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేస్తాడు.
వారు కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేస్తారు.

1. యువకుడు గుంపులో చేరాడు.
2. నేను పూజ చేశాను.
3. దానిపై కొబ్బరికాయ పెడతారు.

**9.** గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తికి చెందినవో రాయండి.

1. తులసీ దళాలు వేసిన చన్నీటితో స్నానం చేస్తారు.
2. ఒక కూడలిలో ఎత్తుగా ఉట్టిని కడతారు.
3. ముంబయిలో ఉట్ల పండుగను చూచి తీరాల్సిందే.
4. కుండను చక్కగా అలంకరిస్తారు.
5. ఎగిరి కర్రతో కొడతారు.



**10.** సంధి చేసి రాయండి.

1. ముఖ్యము + ఐనది = ________
2. వీస్తు + ఉన్న = ________
3. పాటిస్తు + ఉన్నారు = ________
4. వలయ + ఆకారము = ________

11. కింది అంశాల ఆధారంగా దీపావళి పండుగను గూర్చి పది వాక్యాలు రాయండి.

1. ఈ పండుగ ఎప్పుడు వస్తుంది?
2. దీపావళి అనగా నేమి?
3. దీపావళి పండుగ ఏ విధంగా జరుపుకుంటారు?
4. ఈ పండుగ గురించి ప్రచారంలో ఉన్న కథ.
5. టపాకాయలు కాలుస్తున్నపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు.

కింది అంశాల ఆధారంగా పది వాక్యాలు రాయండి.



జననం :

విద్యాభ్యాసం :

సంఘసేవ :

బిరుదులు :

మరణం :

ఉ. సూ. : భారతీయులు జరుపుకునే వివిధ పండుగలను, వాటిలో ఇమిడి ఉన్న సంస్కృతీ సాంప్రదాయాలను గురించి విద్యార్థులకు తెలియజేయండి.

# విజ్ఞాన వినోదం (ఒత్తిడికి కరిగే మంచుగడ్డ)

రెండు ఐస్ క్యూబ్స్ (మంచుముక్కలు) తీసుకోండి. పొడిగాటి దారం తీసుకొని ఒక క్యూబ్‌పై ఉంచి రెండో క్యూబును దానిపై పెట్టండి. ఐస్‌క్యూబ్స్‌ను ఒకదాని కొకటి గట్టిగా అదమండి. ఒత్తిడి తొలగించి చూస్తే రెండూ అతుక్కుపోవడం,





వాటి మధ్య దారం ఇరుక్కుపోవడం కనిపిస్తాయి. ఈ దారాన్ని పట్టుకొని అతుక్కొన్న క్యూబ్స్‌ను మీరు గాల్లోకి లేపవచ్చు.

మంచుగడ్డపై ఒత్తిడి కలిగిస్తే అది కరుగుతుంది. ఒత్తిడిని తొలగిస్తే తిరిగి గడ్డ కడుతుంది. కనుకనే దారం మధ్యలో ఉండగానే ఐస్ క్యూబులు రెండు అతుక్కు పోయాయి.





# 4. లేఖ

రవీంద్ర,
ఇంటి సంఖ్య : **21-42-34**,
మార్కండేయ మందిర్ వీధి,
సోలాపూర్ - **413 005.**
తేది - **25.7.2009**

ప్రియమైన స్నేహితుడు రఫీకి,

నేను క్షేమము. నీవూ క్షేమమని తలంచుచున్నాను. మా పాఠశాలలోని ఒక ముఖ్యవిశేష కార్యక్రమం గురించి నీకు తెలుపదలచుకున్నాను.

నేను మా పాఠశాలలోని బాలభటుసంఘంలోని స్కౌట్‌లో చేరాను. ఈ ఉద్యమ స్థాపకుడు లాడ్‌బేడెన్ పావెల్ అనే మహానీయుడు. భగవంతుని యెడల భక్తిని కలిగియుండి, మాతృదేశానికి, తోటి ప్రజలకు సేవచేయుటియే బాలభటుల ముఖ్యోద్దేశ్యము.



ఈ బాలభటులలో ఆరు సంవత్సరాల నుండి పది సంవత్సరాల బాలికలను 'బుల్‌బుల్' అనియు, బాలురను 'కబ్' అనియు అంటారు. పదకొండు సంవత్సరాల నుండి పదహారు సంవత్సరాల అమ్మాయిలను 'గైడ్స్' అనియు, అబ్బాయిలను 'స్కౌట్స్' అనియు అంటారు.

బాలభటులంతా వ్యక్తిగతంగా ఎలా అభివృద్ధి చెందాలో శిక్షణ ఇస్తారు. అనేక శిబిరాలను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. రకరకాల ముడులను, కట్లుకట్టుటను (బ్యాండేజీలను), ప్రథమ చికిత్సను తెలియచేస్తారు. వాటిని ఏయే సందర్భాలలో ఎలా ఉపయోగించాలో శిక్షణ, అగ్నిప్రమాదాలు, వరదలు, భూకంపాలు వచ్చినపుడు ధైర్యసాహసాలతో ఏవిధంగా బాధితులకు సహాయపడవచ్చునో శిక్షణ యిస్తారు. అంతేకాకుండా ఆయా సామాజిక కార్యక్రమాలలో, ఉత్సవాలలో క్రమశిక్షణను పాటిస్తూ ఎలా ప్రమాదాలను అరికట్టవచ్చునో బాలభటులు ప్రజలకు నేర్పుతారు.


ఇన్ని మంచి పనులను నేర్పే ఈ బాలభట సంఘంలో చేరి తోటి వారికి సేవ చేయాలనే సంకల్పము కలిగింది. ఈ సారి మన గ్రామం వచ్చినపుడు నేను నేర్చుకున్న ముడులు, బ్యాండేజీలు (కట్లుకట్టుట) మీ అందరికి నేర్పుతాను.

మీ అమ్మా నాన్నలకు నా నమస్కారములు. మన స్నేహితులందరిని అడిగినట్లు చెప్పగలవు.




ఇట్లు,
నీ స్నేహితుడు,
రవీంద్ర.

చిరునామా :
మహమ్మద్ రఫీ,
ఇంటి సంఖ్య : 786,
గుగ్గూస్,
చంద్రపూర్ - 442 504.



## అభ్యాసం :

1. ఒక వాక్యంలో జవాబులు రాయండి.
   1. బాలభట సంఘం గురించి ఎవరు ఎవరికి లేఖ రాశారు?
   2. బాలభట సంఘ స్థాపకుడెవరు?
   3. బాలభటుల ముఖ్య ఉద్దేశ్యమేమి?
   4. బుల్‌బుల్ అని ఎవరిని అంటారు?
   5. కబ్ అని ఎవరిని అంటారు?



2. 30-40 పదాలలో జవాబులు రాయండి.
   1. బాలభటులను గురించి రాయండి.
   2. బాలభటులకు ఏయే విషయాలలో శిక్షణ నిస్తారు?

3. గీతగీసిన పదాలు ఏ పురుషలో రాయండి.

1. నేను స్కౌట్‌లో చేరాను.
2. ప్రజలకు సేవ చేయుటయే వారి ముఖ్యోద్దేశ్యము.
3. నీవు మన స్నేహితులను అడిగినట్లు చెప్పగలవు.
4. నేను నేర్చుకున్న ముడులు మీకు నేర్పుతాను.

స్కౌట్ - లోగో

4. గీతగీసిన పదాలను కుండలీకరణములలో అడిగిన విధంగా రాయండి.

1. క్యాంపులలో శిబిరాలను వేస్తారు. (వచనము)
2. అమ్మాయిలను గైడ్స్ అనియు, అబ్బాయిలను స్కౌట్స్ అనియు అంటారు. (వాచకము)
3. అనేక మంచి పనులను నేర్పే బాలభటు సంఘంలో చేరి ప్రజలకు సేవ చేస్తాను. (భాషాభాగము)

5. కింది వాక్యాలు సామాన్య, సంయుక్తములలో ఏ రకానికి చెందినవో రాయండి.

1. నేను స్కౌట్‌లో చేరాను.
2. మాతృదేశానికి, తోటి ప్రజలకు సేవ చేయుటయే బాలభటుల ముఖ్యోద్దేశం.
3. వివిధ రకాల ముడులను, కట్లు కట్టుటను ప్రథమ చికిత్సలో తెలియజేస్తారు.
4. అమ్మాయిలను 'గైడ్స్' అంటారు.
5. అగ్ని ప్రమాదాలు, వరదలు, భూకంపాలు వచ్చినపుడు బాధితులకు ఎలా సహాయపడాలో నేర్పిస్తారు.

6. ఏ విభక్తి ప్రత్యయాలో రాయండి.

1. నేను స్కౌట్‌లో చేరాను.
2. బాలభటులు ధైర్యసాహసాలతో బాధితులకు సహాయపడతారు.
3. పాఠశాలలో జరిగిన ముఖ్య కార్యక్రమము గురించి నీకు తెల్పుచున్నాను.

**7. వ్యతిరేక పదాలు రాయండి.**

1. సందర్భం × ..............................
2. ఉపయోగం × ..............................
3. ధైర్యం × ..............................
4. సంకల్పము × ..............................

**8. కింది అంశాల ఆధారంగా మీ స్నేహితునికొక లేఖ రాయండి.**

**వాతావరణ కాలుష్యము - కారణాలు - రకాలు - నివారణోపాయాలు**

**లేఖ రాయునపుడు పాటించవలసిన నియమాలు :**

1. కుడి చేతివైపున పైభాగంలో మీ చిరునామా నాలుగు వరుసలలో రాయాలి. చివరిలో తేది వుండాలి.
   చిరునామా చివర పిన్‌కోడ్ నంబరు తప్పకుండా వుండాలి.
2. పూజ్యులైన అమ్మ గారికి లేదా నాన్నగారికి అని రాసి కామా వుంచాలి.
3. తరువాత మొదటి పరిచ్ఛేదం ప్రారంభించాలి. ఇందులో క్షేమసమాచారాలు తెలియజేయాలి.
4. రెండు, మూడు పరిచ్ఛేదాలలో లేఖలో అడిగిన విషయమును వివరించాలి.
5. చివరి పరిచ్ఛేదంలో వారి క్షేమం తెలుసుకొనగోరుతూ తిరిగి జాబుకై ఎదురు చూస్తామని రాయాలి.
6. కుడి చేతివైపు కిందగా ఇట్లు, నీ కుమారుడు, పేరు, రాయాలి.
7. ఎడమ చేతి వైపు తండ్రిగారి చిరునామా నాలుగు వరుసలలో రాయాలి.
8. దరఖాస్తు లేఖలు రాయునపుడు మాత్రము చిరునామా ఎడమ చేతివైపు లేఖ పైభాగమున ఉండవలెను.





# దరఖాస్తు లేఖ

టి. ప్రసన్న,
ఇంటి నంబరు : 15/284,
వార్డు నంబరు. 15,
బల్లార్‌పూర్,
30.08.2009.

తరగతి ఉపాధ్యాయురాలు,
నగర పరిషత్తు తెలుగు ప్రాథమికోన్నత పాఠశాల,
బల్లార్‌పూర్,
ఆర్యా,

మామేనత్త పెండ్లి 03.09.2009 తేదీన నిశ్చయించారు. ఆ పెండ్లికి మా తల్లి దండ్రులు, నేను కూడా తప్పక వెళ్ళ వలసి యున్నది. అందువలన నాకు ఆరు రోజులు అనగా 02.09.2009 నుండి 07.09.2009 వరకు సెలవు ఇవ్వగోరుచున్నాను.

నేను పాఠశాలకు హాజరు కాని సమయంలో మీరు బోధించిన పాఠాలను తోటి విద్యార్థుల ద్వారా తెలుసుకొని వ్రాసుకొంటాను. చదువుకొంటాను.

మీకు నా ధన్యవాదములు.

ఇట్లు,
మీ విధేయురాలు,
టి. ప్రసన్న.
ఎనిమిదవ తరగతి.

ఉ. సూ. : 'లేఖ'రాయుటలో పాటించవలసిన నియామాలను విద్యార్థులు సక్రమంగా అనుసరించునట్లు తర్ఫీదు నివ్వండి.

వి. సూ. : పై నియమాలను పాటిస్తూ లేఖను రాయటం నేర్చుకోండి

## పఠనం



సావిత్రీబాయి పులే **1831** జనవరి **3**వ తేదీన సతారా జిల్లాలో నాయ్‌గావ్‌లో జన్మించారు. చిన్నప్పటినుండి చదువంటే ఆమెకు ఎంతో ఇష్టం. ఆరోజుల్లో బాలికలకు పాఠశాలకు వెళ్ళి చదువుకునే అవకాశం ఉండేది కాదు. జ్యోతిబా పులేతో వివాహం జరిగాక అతను తన భార్యకు చదవటం, రాయడం నేర్పించారు. పులే దంపతులు బాలికలు, స్త్రీల కొరకు పుణెలో బుధవార్‌పేటలో ఒక పాఠశాల ప్రారంభించారు. స్త్రీల కోసం స్థాపించబడిన మొట్టమొదటి పాఠశాల అదే. మొదటి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పులే. వారిరువురు ఆ తర్వాత మహర్‌వాడాలో రెండవ పాఠశాల ప్రారంభించారు. సావిత్రీబాయి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేశాక ఆమె పాఠశాలకు ప్రభుత్వం గుర్తింపు లభించింది.

భర్తతో కలిసి సమాజోద్ధరణకు ఆమె ఎంతగానో పాటుపడ్డారు. అనాథ బాలబాలికలను, స్త్రీలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించేవారు. పుణె పట్టణంలో ప్లేగు వ్యాధి సంభవించినపుడు ఆమె నడుంకట్టి ముందుకు వచ్చి ఎంతో సేవ చేశారు. ఆమె సమాజసేవికే కాదు కవయిత్రి కూడా. 'కావ్యపులే, సుబోధ్ రత్నాకర్ మొదలగునవి ఆమె రచనలు. ప్లేగు వ్యాధి సావిత్రీబాయిని కబళించింది. భారత మహిళలందరికి ఆదర్శమహిళయైన సావిత్రీబాయిని భారతదేశం కోల్పోయింది.

ప్రశ్నలు :

1. సావిత్రీబాయికి చదవటం, రాయటం ఎవరు నేర్పించారు?
2. పులే దంపతులు స్త్రీల పాఠశాలను ఎచ్చట స్థాపించారు?
3. సావిత్రీబాయి రచనలేవి?
4. సావిత్రీబాయి ఎట్లు మరణించెను?

# 5. తన కోపమే తన శత్రువు

అనగనగా ఓ చిలక, ఎలుక స్నేహంగా వుండేవి. ఎంత స్నేహం అంటే వాటిమధ్య ఎప్పుడూ ఏ తగువులూ తకరార్లూ లేవు. ఏ పని అయినా ఒకరికొకరు కలిసే ఆలోచించటం, కలిసే చెయ్యటం.

ఒకనాడు వాటికి ఓ కంకి గోధుమ గింజలు దొరికాయి. "వాటిని యేం చెయ్యటమా?" అని ఆలోచించి ఆలోచించి, 'భూమిలో చల్లి పండించాలి' అనుకున్నాయి.



ఎలుక నేల మొత్తాన్ని మెత్తగా కుళ్ళగించింది. చిలుక విత్తనాలు చల్లింది. పంట కూడా బాగానే పండింది. ఇకనేం! చిలుకా, ఎలుకా రాశి ముందు కూర్చుని, అటొక గింజా ఇటొక గింజా వేస్తూ పంచుకోవటం ప్రారంభించాయి. అలా పంచగా, ఒక్క గింజ మిగిలి పోయింది.

"అది నాది నేలను పదును చేసేటప్పుడు, నామూతీ, గోళ్ళు, రక్తం చిమ్మేటట్టుగా కష్టపడ్డాను. ఆ గింజ నాది" అన్నది ఎలుక.

"కాదు ఆ గింజ నాకు రావాలి. విత్తనాలు చల్లేటప్పుడు నా రెక్కలు ముక్కలయ్యేటంతగా కష్టపడ్డాను" అంది చిలుక.

చివరకు ఆ ఒక్క గింజనూ చటుక్కున ముక్కున కరచుకొని, తుర్రున ఎగిరిపోయింది చిలుక.



"ఎగిరిపోయే నన్ను ఎలుక ఎలా పట్టుకుంటుందో, యీ గింజ ఎలా తీసుకుంటుందో చూస్తా" అనుకుంది. ఎలుక దానితో పాటు ఎగరలేదుగా పైగా "తగాదా మొదలు పెట్టింది నేనే, నాదే తప్పు" అనుకుంటూ తనవంతు ధాన్యాన్ని కలుగులోకి మోసుకుపోయింది. ఎలుక చిలుక యింకా వస్తుంది, యింకా వస్తుందని ఎదురు చూసింది. చూసి చూసి చిలుక ధాన్యం కూడా భద్రం చేసింది.

ఎలుకకు మాత్రం, ఏడాది పొడగునా తిండికి యిబ్బంది లేకుండా జరిగిపోయింది. చిలుక ఆకలితో ఏమి అవస్థలు పడుతుందో ఏమో! అనుకుంది ఎలుక. 'తన కోపమే తన శత్రువు' అని చిలుక కోపం చిలుకకే ముప్పు తెచ్చింది.

ఒకనాడు తానుంటున్న చెట్టుకొమ్మపై చిలుక కూర్చొని వుండటం చూసి ఎలుక సంతోషంగా దాన్ని పలకరించింది. ఎంతో కాలంగా ఆహారం లభించక చిలుక బాగా నీరసించివుంది. తన తప్పు తెలుసుకొని ఎలుకను క్షమించమని కోరింది. ఎలుక ప్రేమతో దాన్ని తన ఇంటికి ఆహ్వానించి తాను దాచి వుంచిన దాని వంతు ధాన్యాన్ని చిలక్కి అప్పగించింది. కలసి వుండటంలో గల మాధుర్యాన్ని అనుభవిస్తూ అవి చిరకాలం హాయిగా, సుఖంగా స్నేహంతో కలిసిజీవించసాగాయి.

## అభ్యాసం :

**1.** అర్థాలు :

తకరార్లు = పోట్లాటలు ; కుళ్ళగించింది = తవ్వింది ; రాశి = కుప్ప ; పదను = తడి ; కలుగు = కన్నం ; అవస్థలు = బాధలు ; ముప్పు = ఆపద ; మాధుర్యం = తీపి.

**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. చిలుక, ఎలుక ఏ విధంగా స్నేహంగా ఉన్నాయి?
2. చిలుక, ఎలుకలకు ఏం దొరికాయి?
3. గోధుమ గింజలను ఏం చేయాలని ఆలోచించాయి?
4. ఎలుక ఏ పని చేసింది?
5. చిలుక, ఎలుక గోధుమ గింజలను ఏ విధంగా పంచుకోవడం ప్రారంభించాయి?
6. మిగిలిన గోధుమ గింజ తనకే రావాలని ఎలుక ఎందుకన్నది?
7. చిలుక మిగిలిన చివరి గోధుమ గింజ తనదేననటానికి కారణమేంటి?

8. ఎగురుతూ చిలుక ఏం అనుకుంది?

9. ఎలుక తనదే తప్పని ఎందుకనుకున్నది?

10. "కలసి ఉంటే కలదుసుఖం" అని చిలుక ఎలా తెలుసుకుంది?

**3.** 30-40 పదాలలో జవాబులు రాయండి.

1. చిలుక, ఎలుక ఏ విధంగా ధాన్యాన్ని పండించాయి?
2. చిలుక, ఎలుక ఎందుకు వాదులాడుకున్నాయి?
3. వాదులాటలో చిలుక ఏం చేసింది?
4. చిలుక వెళ్ళిపోయిన తర్వాత ఎలుక ఏం చేసింది?
5. ఎలుక జీవితం సుఖంగా ఎందుకు సాగిపోయింది?
6. ఎలుక, చిలుకలు ఏ విధంగా కలుసుకున్నాయి?

**4.** ఎవరు ఎవరితో అనిరి.

1. "ఆ గింజ నాది".
2. "ఆ గింజ నాకు రావాలి".
3. "ఈ గింజ ఎలా తీసుకుంటుందో చూస్తా".
4. "తగాదా మొదలు పెట్టింది నేనే".
5. "ఆకలితో ఏం అవస్థలు పడతుందో".

**5.** వచనాన్ని మార్చి రాయండి.

1. చిలుక, ఎలుక గింజలను పంచుకోవటం ప్రారంభించాయి.
2. ఆ గింజ నాకు రావాలి.
3. తగాదా మొదలు పెట్టింది నేనే.

**6.** గీతగీసిన పదాలు ఏ భాషాభాగమో రాయండి.

1. ఎలుక నేల మొత్తాన్ని మెత్తగా కుళ్ళగించింది.
2. పంట కూడా బాగానే పండింది.
3. అవి గింజలు పంచుకోవడం ప్రారంభించాయి.
4. అది నాది.
5. తప్పు నాదే.



7. పట్టికను చూచి వాక్యాలు రాయండి.

| | | |
|---|---|---|
| 1. చిలుక, ఎలుక | కి | ఇబ్బంది లేకుండా గడిచి పోయింది. |
| 2. చిలుక గింజ | ను | తీసికొని ఆకాశంలోకి ఎగిరింది. |
| 3. ఎలుక నేల | లు | స్నేహంగా ఉండేవి. |
| 4. ఎలుకకు తిండి | కొరకు | మెత్తగా కుళ్ళగించింది. |
| 5. ఆ ఒక్క గింజ | చేత | చిలుక నీరసించి ఉంది. |
| 6. ఆహారం లభించక పోవటం | | వాదులాడుకున్నాయి. |

8. కాలాలు రాయండి.

1. చిలుక విత్తనాలు చల్లడం మొదలు పెట్టింది.
2. వాటికి ఒకనాడు గోధుమ గింజలు దొరికాయి.
3. చిలుక యింకా వస్తుందని ఎలుక ఎదురు చూస్తూ ఉన్నది.

9. వాక్యాంగాలు రాయండి.

1. ఎలుక నేలను మెత్తగా కుళ్ళగించింది.
2. చిలుక గింజను తీసుకొని ఎగిరిపోయింది.
3. చిలుక ఎలుకను క్షమించమని కోరింది.

10. కలిపి రాయండి.

1. ఒకరికి + ఒకరు = ..................................
2. వస్తుంది + అని = ..................................
3. తాను + ఉంటున్న = ..................................
4. క్షమించు + అని = ..................................

11. కింది వాక్యాలు సామాన్య, సంయుక్తములలో ఏ రకానికి చెందినవో రాయండి.

1. చిలుక విత్తనాలు చల్లింది.
2. నా మూతీ, గోళ్ళు రక్తం చిమ్మేటట్టుగా కష్టపడ్డాను.
3. తగాదా మొదలు పెట్టింది నేనే.

4. తన కోపమే తన శత్రువు కనుక చిలుక కోపం చిలుకకే ముప్పు తెచ్చింది.

5. ఒకనాడు చెట్టుపై చిలుక వచ్చి కూర్చొనివుంది. అది చూసి ఎలుక దాన్ని సంతోషంగా పలకరించింది.

6. చిలుక, ఎలుక చిరకాలం సుఖంగా, హాయిగా, స్నేహంగా కలిసి జీవించసాగాయి.

**12.** కింద ఇచ్చిన ఆధారాలతో గడినుడి పూరించండి.


అధారాలు :

అడ్డం :


1. 'భాష'కు వికృతి పదం
3. వాసన చూసే జ్ఞానేంద్రియం
4. భారతదేశమును ఏలిన రాజు
5. పోతన రాసిన గ్రంథం
7. ఒక ఋతువు
8. కోతికి పర్యాయ పదం

నిలువు :

1. స్కౌటులో చేరిన బాలుడు
2. పాండవులలో బలశాలి
5. కురుపాండవుల కథ
6. వాన తలక్రిందులు




ఉ. సూ. : బాల సాహిత్యాన్ని విద్యార్థులకు పరిచయం చేసి చందమామ, బుజ్జాయి వంటి మాసపత్రికలను విద్యార్థులు చదువునట్లుగా ప్రోత్సహించండి.



# 6. వికీ పీడియా

(విద్యార్థులు-ఉపాధ్యాయులు కంప్యూటర్ గదిలో కూర్చున్నారు.)

ఉపాధ్యాయుడు : మేము చదువుకునే రోజుల్లో ఏదైనా విషయాన్ని తెలుసుకోవాలంటే పెద్దలను అడగడం లేదా గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలను తిరగ వేయాల్సి ఉండేది.

రవితేజ : మేమైతే ఇప్పుడు కంప్యూటర్‌లో అన్నీ తెలుసుకోవచ్చు.

ఉపా : అవును. కంప్యూటర్ ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకొనే అవకాశం ఉంది. కంప్యూటర్ అంటే ఏమిటో చెప్తారా?

సుమలత : కంప్యూటర్ అనేది ఒక ఎలక్ట్రానిక్ సాధనం. ఇది మనం ఇచ్చిన సమస్య యొక్క 'డేటా' (ఇన్‌పుట్)ను స్వీకరిస్తుంది. ముందుగా ఇచ్చిన 'ప్రోగ్రామ్' ప్రకారం డేటాను విశ్లేషించి ఫలితాలను (అవుట్‌పుట్) అందజేస్తుంది.

ఉపా : శెభాష్! చాలా బాగా చెప్పావు? హార్డ్‌వేర్ అని దేనిని అంటారు.

షారూక్ : చేతితో తాకి చూపగలిగే కంప్యూటర్ భాగాలను 'హార్డ్‌వేర్' అని అంటారు.

ఉపా : శెభాష్! సాఫ్ట్‌వేర్ అంటే ఏమిటి?

తబిత : కంప్యూటర్‌లో మనం చూచే రకరకాల ప్రోగ్రాముల సముదాయాన్నే సాఫ్ట్‌వేర్ అంటారు.

ఉపా : శెభాష్! కంప్యూటర్ గురించి మీ పూర్వజ్ఞానం తెలుసుకోవాలని ఈ ప్రశ్నలడిగాను. చాలా బాగా చెప్పారు. రకరకాల ప్రోగ్రాములను చూడడానికి మన కంప్యూటర్‌కు

ఇంటర్నెట్‌తో అనుసంధానం ఉండాలి. తద్వారా విజ్ఞాన సర్వస్వం (ఎన్‌సైక్లోపీడియా) ఎంతో ఉపయోగపడుతుంది.

లావణ్య : విజ్ఞాన సర్వస్వం (ఎన్‌సైక్లోపీడియా) అంటే ఏమిటి? మేడమ్.

ఉపా : విజ్ఞాన సర్వస్వం అనగా ఒకటి లేదా కొన్ని పుస్తకాల కలయిక అని చెప్పవచ్చును. ఆ పుస్తకంలో ప్రపంచలో ఉన్న ప్రతి విషయాన్ని గురించి వివరణ ఉంటుంది. ఉదాహరణకు వన్యమృగాలు-వాటి సంరక్షణ గురించి సంపూర్ణ సమాచారం తెలుసుకోవచ్చు

రవితేజ : గూగల్ అనే వెబ్‌సైట్ కూడా ఉంది కదా! మేడమ్.

ఉపా : గూగల్ వెబ్‌సైట్ ద్వారా కూడా మీరు ఆయా సైట్స్‌లోకి వెళ్ళవచ్చును. విజ్ఞాన సర్వస్వం (ఎన్‌సైక్లో పీడియా) అనే వెబ్‌సైట్‌కి అనుబంధమై సరికొత్తగా వికీపీడియా అనే వెబ్‌సైట్‌ను 2000 సం॥లో జిమ్మీవేల్స్, లోర్రీ సాంగర్ అనే విజ్ఞాన వేత్తలు ప్రారంభించారు. వికీపీడియా రెండుపదాల కలయిక. ఇది హైవేనియయస్ భాషా పదం. 'వికి' అనగా 'త్వరితం' అని అర్థం. 'పీడియా' అనేది ఎన్‌సైక్లోపీడియా లోనిది.

షారూక్ : వికీపీడియా వలన ప్రత్యేక ఉపయోగాలు ఉన్నాయా? మేడమ్.

ఉపా : వికీపీడియాలో వేలకువేల విషయాలను గురించిన సమాచారం పట్టికల రూపాలలోనూ, బొమ్మల, మానచిత్రాల రూపాలలోనూ చక్కగా వివరించబడి ఉంటుంది. వాటి ద్వారా విషయాలను బాగా గ్రహించగలుగుతాము.

సుమలత : వికీపీడియా వెబ్‌సైట్ చాలా ఉపయోగకరంగా ఉంది కదా! మేడమ్.

ఉపా : మీరంతా విషయసేకరణ చేసుకోవడమే కాకుండా ఆ విషయం గురించిన విశేషాలు లేదా అదనపు సమాచారం మీకు తెలిసినట్లయితే మీరు కూడా ఈ వికీపీడియా వెబ్‌సైట్‌కి పంపవచ్చును. ఇలా నిరంతము ఎప్పటికప్పుడు తాజాగా మరియు అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఈ రకమైన మార్పుల చేర్పుల ద్వారా ప్రపంచంలో ఉన్న విజ్ఞానవంతులు మరియు విద్యాధికులు తమ ఆలోచనలను, అభిప్రాయాలను పొందుపరచి వికీపీడియా అభివృద్ధికి విశేషంగా తోడ్పడవచ్చును.

గురుసింగ్ : ఈసైట్‌లోనికి ఎలా వెళ్ళాలి?



ఉపా : ఈ సైట్‌లోనికి వెళ్ళాలంటే www.wikipedia.com ద్వారా వెళ్ళవచ్చును.

సుమలత : ఈ వెబ్‌సైట్ వారు ఇలా చేయడం వలన వారికేమైనా లాభాలు ఉంటాయా? మేడమ్.

ఉపా : వికీపీడియా ఏ రకమైన లాభాన్ని దృష్టిలో పెట్టుకొనకుండా అందరికి ఉచితంగా విజ్ఞానాన్ని పంచే ఒక వేదిక. మీరు కూడా వికీపీడియా అభివృద్ధికి తోడ్పడండి.

విద్యార్థులు : మేము ఈ రోజే వికీపీడియా వెబ్‌సైట్ చూస్తాము.



## అభ్యాసం :

1. అర్థాలు :

సాధనం = పనిముట్టు, పరికరం ; విశ్లేషించి = క్షుణ్ణంగా పరిశీలించి ; స్వీకరించు = తీసుకొను ; సముదాయం = గుంపు ; అనుసంధానం = కూర్చడం ; సంపూర్ణ = పూర్తి ; వన్యమృగములు = అడవి జంతువులు ; అదనము = ఎక్కువ ; నిరంతరం = ఎల్లప్పుడు

2. ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. కంప్యూటర్ అంటే ఏమిటి?
2. హార్డ్‌వేర్ అని దేనిని అంటారు?
3. కంప్యూటర్‌కు ఇంటర్నెట్‌తో అనుసంధానం ఎందుకు ఉండాలి?
4. వికీపీడియా అనగా అర్థమేమి?
5. వికీపీడియా సైట్‌లోనికి ఎలా వెళ్ళవచ్చును?

**3. 30-40 పదాలలో జవాబులు రాయండి.**

1. కంప్యూటర్ ఏం చేస్తుంది?
2. ఎన్‌సైక్లోపీడియా అంటే ఏమిటి?
3. వికీపీడియా గురించి రాయండి?
4. వికీపీడియా ఉపయోగా లేమిటి?

**4. ఎవరు ఎవరితో అనిరి.**

1. "కంప్యూటర్‌కు ఇంటర్నెట్‌తో అనుసంధానం ఉండాలి."
2. "ఈ సైట్‌లోనికి ఎలా వెళ్ళాలి?"
3. "ఉచితంగా విజ్ఞానాన్ని పంచే ఒక వేదిక."

**5. సంధిచేసి రాయండి.**

1. గ్రంథ + ఆలయం  2. ప్రశ్నలు + అడిగాను
3. విద్య + అధికులు  4. వారికి + ఏమైనా

**6. గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తికి చెందినవో రాయండి.**

1. గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలను తిరగ వేయాల్సి ఉండేది.
2. కంప్యూటర్ గురించి మీ పూర్వ విజ్ఞానం తెలుసుకోవాలని ఈ ప్రశ్నలడిగాను.
3. వికీపీడియా వలన ప్రత్యేక ఉపయోగాలున్నాయా.
4. వీటి ద్వారా విషయాలను గ్రహించగలుగుతాము.
5. ఈ వెబ్‌సైట్‌కి ఎలా వెళ్ళాలి.

**7. గీతగీసిన పదాలు ఏ భాషాభాగానికి చెందినవో రాయండి.**

1. కంప్యూటర్ ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకొనే అవకాశం ఉంది.
2. మనం ఇచ్చిన సమస్య యొక్క డేటాను స్వీకరిస్తుంది.
3. ప్రపంచంలో ఉన్న ప్రతి విషయాన్ని గురించి వివరణ ఉంటుంది.
4. వాటి ద్వారా విషయాలను బాగా గ్రహించగలుగుతాము.
5. వికీపీడియా అభివృద్ధికి విశేషంగా తోడ్పడవచ్చును.
6. మేము ఈ రోజే వికీపీడియా వెబ్‌సైట్ చూస్తాము.

8. కింది వాక్యాలను సామాన్య, సంయుక్త వాక్యాలను గుర్తించండి.

1. మీరు ఆ సైట్ లోనికి వెళ్ళవచ్చు.
2. మన కంప్యూటర్‌కు ఇంటర్నెట్‌తో అనుసంధానం ఉండాలి. తద్వారా విజ్ఞాన సర్వస్వం ఎంతో ఉపయోగపడుతుంది.
3. విద్యార్థులు తమ ఆలోచనలను, అభిప్రాయాలను వికీపీడియాలో పొందుపరచవచ్చు.
4. వికీపీడియా ఉచితంగా విజ్ఞానాన్ని పంచే ఒక వేదిక.






ఉ. సూ. : ఇంటర్నెట్ ద్వారా లభ్యమయ్యే తెలుగు సాహితీ సంస్కృతులకు సంబంధించిన వివిధ 'వెబ్‌సైట్'లను 'బ్లాగ్'లను సందర్శించి సమాచారాన్ని సేకరించండి.

# 7. అభినవ్ బింద్రా



112 ఏళ్ళ చరిత్రగల ఒలింపిక్ క్రీడల్లో వ్యక్తిగత విభాగంలో మన భారత దేశానికి స్వర్ణపతకాన్ని తెచ్చిన ఘనత అభినవ్ బింద్రాది. 08-08-2008 సం॥లో చైనా రాజధానియైన బీజింగ్‌లో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో పాల్గొని యావద్భారతదేశం పులకించునట్లు పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ విభాగంలో స్వర్ణపతకాన్ని చేజిక్కించుకున్నారు బింద్రా. ఆ సమయంలో వంద కోట్లకుపైబడ్డ భారతీయులకు ప్రీతిపాత్రమైన జాతీయ గీతాలాపన వీనులవిందుగావించింది. అభినవ్ కంఠాన్ని అలంకరించిన బంగారు పతకాన్ని చూసి భారతావని పరవశించి, ఆ యువకిశోరాన్ని అభినందలతో ముంచెత్తింది.

అభినవ్ బింద్రా 1982 సెప్టెంబరు 28న డెహ్రాడూన్‌లో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు బబ్లీ బింద్రా, ఏ.యస్. బింద్రా. వీరి స్వస్థలం చండీగఢ్. అభినవ్ విద్యాభ్యాసం డెహ్రాడూన్, చండీగఢ్‌లలో జరిగింది.

అమెరికాలోని కొలరాడోలో ఎం.జి.ఏ చేశారు. ప్రస్తుతం బింద్రా ఫ్యూచరిస్టిక్స్‌కు సి.ఈ.ఓ గా పనిచేస్తున్నారు.

బింద్రా అనేక అవార్డులను పొందారు. జిల్లా స్థాయిలోను, రాష్ట్రస్థాయిలోను ఆరు స్వర్ణ పతకాలను సాధించారు. **2000** సం॥లో మ్యూనిచ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో **596** పాయింట్లతో ప్రపంచ రికార్డు సృష్టించారు బింద్రా. **2006** సం॥లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన తొలిభారతీయుడు అభినవ్ బింద్రా. వీరు **2001** సం॥లో ప్రాచుర్యమున్న అర్జున్ అవార్డును కూడా పొందారు. బింద్రా తన **18**వ ఏటనే అత్యున్నత క్రీడాపురస్కారం అయిన 'రాజీవ్ ఖేల్‌రత్న'ను సాధించుకున్నారు. అభినవ్ నిర్మల మనస్కుడు. కఠోర పరిశ్రమ చేయు స్వభావం కలవాడు. కష్టపడి పనిచేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చనే విశ్వాసం కలవాడు. పుణెలో త్వరలో స్పోర్ట్స్ పబ్లిక్ స్కూలును ఏర్పాటు చేయనున్నారు.

'వ్యక్తిగతంగా ఒలింపిక్స్ స్వర్ణ పతకం సాధించిన తొలిభారతీయునిగా బింద్రా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు.'

## అభ్యాసం :

1. అర్థాలు :

ఘనత = గొప్పదనం; స్వర్ణము = బంగారము; చేజిక్కించుకొనుట = పొందుట; ప్రీతి పాత్రము = ఇష్టము; భారతావని = భరతభూమి, భారతదేశం; పరవశించి = ఆనందించి; ప్రాచుర్యం ఉన్న = ప్రసిద్ధిపొందిన; అత్యున్నత = ఎంతో గొప్పదైన; నిర్మల మనస్కుడు = స్వచ్ఛమైన మనస్సుకలవాడు; కఠోర పరిశ్రమ = బాగా కష్టపడు; రాణించు = పేరుపొందు; చిరస్థాయిగా = శాశ్వతంగా, ఎల్లప్పుడు; పులకించుట = ఆనందంతో పరవశించుట.

**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. అభినవ్ బింద్రా ఘనత ఎట్టిది?
2. అభినవ్ బింద్రా ఎప్పుడు, ఎచ్చట జన్మించారు?
3. అభినవ్ బింద్రా తల్లిదండ్రులెవరు?
4. బింద్రా తన 18వ ఏట సాధించిన పురస్కారమేది?
5. బింద్రా భారతదేశ చరిత్రలో ఏ విధంగా చిరస్థాయిగా నిలిచిపోతాడు?

**3.** 30-40 పదాలలో జవాబులు రాయండి.

1. బింద్రా విజయానికి భారతదేశం ఏ విధంగా పరవశించింది?
2. బింద్రా తన విద్యాభ్యాసాన్ని ఎక్కడెక్కడ కొనసాగించారు?
3. బింద్రా పొందిన అవార్డులేవి?
4. ఒలింపిక్ పోటీల గురించి వివరించండి.

**4.** ఖాళీలను పూరించండి.

1. ఆ యువకిశోరాన్ని ............. ముంచెత్తింది.
2. బింద్రా ఫ్యూచరిస్టిక్స్‌కు ..............గా పని చేస్తున్నాడు.
3. బింద్రా 2001 సం॥లో ప్రాచుర్యమున్న .............. అవార్డును కూడా పొందారు.

**5.** గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. బింద్రా పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ షూటింగ్ విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించారు.
2. అభినవ్ బింద్రా డెహ్రాడూన్ లో జన్మించారు.
3. బింద్రా అనేక అవార్డులను పొందారు.

**6.** కలిపి రాయండి.

1. గీత + ఆలాపన = ..............................
2. భారత + అవని = ..............................
3. విద్య + అభ్యాసం = ..............................
4. రాణించవచ్చు + అనే = ..............................

7. గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1. భారతావని ఆ యువకిశోరాన్ని అభినందనలతో ముంచెత్తింది.
2. బింద్రా అనేక అవార్డులను పొందారు.
3. బింద్రా, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు.

8. సొంత వాక్యాలలో రాయండి.

1. ఘనతకెక్కు 2. పులకించు 3. వీనులవిందు
4. అభినందనలు 5. రాణించు 6. చిరస్తాయిగా నిలిచిపోవు.

9. కింది అంశాల ఆధారంగా క్రీడల గురించి పదివాక్యాలు రాయండి.

క్రీడలు ప్రాముఖ్యత - వివిధ క్రీడలు - వివిధ క్రీడలలో ప్రావీణ్యం సంపాదించిన క్రీడా కారులు - ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్న విధము - ముగింపు



ఉ. సూ. : విద్యార్థులు వివిధ ఆటల పోటీలలో ఉత్సాహంతో పాల్గొనునట్లు ప్రోత్సహించండి.

# 8. సౌగంధిక పుష్పం



ఒకనాడు భీముడు ద్రౌపదితో కలిసి గంధమాదన పర్వత సమీపంలో సంచరిస్తూ ఉండగా, పుష్ప పరిమళ భరితమైన చల్లని గాలి వీచింది. ఆ గాలికి ఒక ఎర్ర కలువ పూవు ఎగిరి వచ్చి వారి మధ్యపడింది.

ఆ పువ్వు చాలా రమణీయమయినది. దానికి వెయ్యి రేకులున్నాయి. ఆ పువ్వును తీసుకుని ద్రౌపది వాసన చూచింది. "వాయునందనా! ఇలాంటి పూలు నాకు కొన్ని తెచ్చి ఇవ్వండి." అని కోరింది.

ఆ పువ్వు పేరు సౌగంధిక. ద్రౌపది కోరిక తీర్చుదామని భీముడు పుష్పాల కోసం బయలుదేరాడు. ఆ పూల పరిమళం వస్తున్న దిశగా వెళ్ళాడు. అలా చాలా దూరం వెళ్ళి భయంకరంగా సింహనాదం చేశాడు. ఆ ధ్వనికి కొండలు, గుహలు దద్దరిల్లాయి.

అక్కడ ఒక పెద్ద వనం వుంది. ఆ వనం మధ్యలోనున్న హనుమంతుడు భీముని సింహనాదం విన్నాడు. అది తన తమ్ముడు భీమసేనుడి కంఠస్వరమని గ్రహించాడు. అతన్ని చూడాలని కుతూహలపడ్డాడు. వెంటనే తన తోకతో భూమిని చరిచాడు. ఆ శబ్దానికి భీముడు ఉలిక్కిపడి అటువైపు వెళ్ళి చూచాడు.

అప్పుడు ఆ వనం మధ్య ఒక పెద్ద ముసలి కోతి ఒకటి తోక చాచుకొని పడుకునివుండటం అతనికి కనిపించింది. ఆ కోతిని భయపెట్టాలనుకుని మళ్ళీ బిగ్గరగా సింహనాదం చేశాడు. అప్పుడు హనుమంతుడు మెల్లగా కళ్ళు తెరిచి భీమసేనుని వంక చూచాడు. చిరునవ్వు నవ్వాడు.

"అయ్యా! నిద్రపోతున్న వృద్ధుణ్ణి నీవు నిష్కారణంగా లేపావు. ఇది ధర్మం కాదు. అయినా నీవు ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు? ఇది మానవులు ప్రవేశించకూడని దేవమార్గం. వెళ్ళిపో" అని పలికాడు.



అందుకు భీముడు "అయ్యా! క్షత్రియుణ్ని. కుంతికి వాయుదేవుని వలన జన్మించినవాణ్ణి. నా పేరు భీముడు. మరి నీవెవరు. చూడబోతే గొప్పవాడిలా వున్నావు? ఈ ముసలి కోతి రూపం నీకు ఎందుకు వచ్చింది. దారి తప్పుకో. నేను ముందుకు సాగిపోవాలి. నన్ను దేవతలూ, దానవులూ ఎవరూ అడ్డగించలేరు" అని గంభీరంగా బదులు చెప్పాడు.

కాని హనుమంతుడు దారి ఇవ్వలేదు. "నాయనా! నేను వృద్ధుణ్ణి. లేవడానికి శక్తి లేనివాణ్ణి. అంతగా వెళ్ళాలనుకుంటే నన్నుదాటి వెళ్ళు" అన్నాడు.

భీముడు "జంతువులను దాటి వెళ్ళకూడదని ధర్మశాస్త్రం. అందువల్ల నీవే మర్యాదగా దారి తప్పుకో, లేదా నాకు కోపం వస్తుంది. నిన్నూ ఈ గంధమాదన పర్వతాన్నీ కూడా పూర్వం మా అన్న హనుమంతుడు నూరామడల సముద్రాన్ని లంఘించినట్లుగా, లంఘించి పోగలను. ఏమనుకున్నావో?" అని హెచ్చరించాడు.

తన తమ్ముడు తనెవరో తెలియకుండానే తన పేరు ఉచ్చరించి నందుకు మారుతి మనస్సులో సంతోషించాడు. తమ్ముణ్ని పరీక్షించి కొంచెం గర్వభంగం చేయాలని ముచ్చట పడ్డాడు. "అయితే, నాయనా! నీవే నా తోక కాస్త ప్రక్కకు తప్పించి వెళ్ళిపో. నేను బొత్తిగా కదలలేకుండా వున్నాను" అన్నాడు.



అప్పుడు మహాబలుడగు భీముడు తన ఎడమ చేత్తో ఆంజనేయుడి తోక ఎత్త బోయాడు. అది వీసమయినా కదలలేదు. అప్పుడు రెండు చేతులతో ప్రయత్నించాడు. కాని కొంచెమైనా తోక కదలించలేకపోయాడు. అతని బలమంతా వ్యర్థమైంది. ఆయాసం వచ్చింది. వృకోదరుడికి ఆశ్చర్యం కలిగింది. వెంటనే భక్తితో చేతులు జోడించి నమస్కరించాడు.

"మహాత్మా! మీరు సామాన్యులు కారు. మీ దగ్గర బీరాలు పలికాను. నన్ను మన్నించండి" అని ప్రార్థించాడు. అప్పుడు హనుమంతుడు "నాయనా! భీమసేనా, నేనే హనుమంతుణ్ణి, మీ అన్నను. నీ కంఠం విని, నిన్ను చూడాలని ముచ్చటపడ్డాను. ఇలా నిన్ను పరీక్షించాను" అని చెప్పాడు.

భీముడు ఆనందంతో పొంగిపోయాడు. మారుతికి సాష్టాంగ నమస్కారం చేశాడు. "మహాత్మా! నీ దర్శన భాగ్యం వలన ఈ జన్మ తరించింది" అన్నాడు ఆనందాశ్రువులు రాలుస్తూ.

"మహావీరా! మిమ్మల్ని గురించి, మీమహిమల్ని గురించి చాలా చాలా విన్నాను. కాని ఇప్పుడు కళ్ళారా చూడగలుగుతున్నాను. ఆ నాడు మీరు సముద్రం లంఘించేటప్పుడు ధరించిన విశ్వరూపం ఒక్కసారి చూడాలని వుంది" అన్నాడు భీముడు. మారుతి నవ్వి, తన దేహాన్ని పెంచాడు. ఆ రూపం ఆకాశం అంటినంత ఎత్తు పెరిగింది. హనుమంతుడి విశ్వరూపం కోటి సూర్యులతో సమానమైన తేజస్సుతో వెలిగిపోయింది. ఆ తేజస్సు చూడగానే భీముడికి కళ్ళు చెదిరాయి.

"భీమసేనా! శత్రువులు కంటపడినప్పుడు, నేను యుద్ధం చేయాలనుకున్నప్పుడు నా రూపం ఇంతకన్నా రెట్టింపు పెరిగిపోతుంది నాయనా! ఏం కావాలో కోరుకో! వరాలు ఇస్తాను" అన్నాడు.

అప్పుడు భీముడు కౌరవులు తమకు చేసిన అన్యాయాన్ని గురించి తాము వనాలలో కష్టాలు అనుభవిస్తున్న సంగతి వివరంగా తెలియ చేశాడు.

"మహాత్మా! నీ దర్శనం అయింది. అదే మాకు విజయ సూచకం. మీ అనుగ్రహం వలన యుద్ధంలో కౌరవులను జయిస్తాము" అన్నాడు.

మారుతి సంతోషించి "నాయనా! నీవు నా సోదరుడివి. నీవు కోరకపోయినా వరం ఇస్తున్నాను. మీకూ, కౌరవులకూ యుద్ధం జరిగి తీరుతుంది. నీవు రణభూమిలో నిలిచి ఎప్పుడు సింహగర్జన చేస్తావో, అప్పుడు నీ కంఠస్వరంతో నా కంఠస్వరం కలిసి శత్రువుల గుండెలను దద్దరిల్ల చేస్తుంది. నేను నీ తమ్ముడి అర్జునుడి రథ ధ్వజంపై వుంటాను. మీ బలాన్ని వృద్ధి పొందిస్తాను. మీకు జయం కలిగేలా చేస్తాను" అని వరం ఇచ్చాడు.

తరువాత సౌగంధికా పుష్పాలున్న చోటు చెప్పి అదృశ్యుడైనాడు. భీముడు, హనుమంతుడు చెప్పిన త్రోవనే వెళ్ళి సౌగంధికా వనం చేరుకున్నాడు. అది ఒక పెద్ద కొలను. దాని చుట్టూ భయంకరాకారులయిన పురుషులు ఆయుధపాణులై కావలి కాస్తున్నారు. వారు అడ్డగించగా భీముడు వారందరితో యుద్ధం చేసి పారద్రోలాడు. కావలసినన్ని సౌగంధిక పుష్పాలను కోసుకొని మరలి వచ్చి, పాంచాలికి ఇచ్చాడు. ద్రౌపది చాలా సంతోషించింది.

## అభ్యాసం :

1. అర్థాలు :

పరిమళభరితము = సువాసనతో కూడిన ; రమణీయము = అందము ; అభిలాష = కోరిక ; నిష్కారణంగా = కారణం లేకుండా ; ఉచ్చరించుట = పలుకుట ; బీరాలు = గొప్పలు ; లంఘించుట = దాటుట ; వనాలు = అరణ్యాలు ; రణభూమి = యుద్ధ భూమి ; అదృశ్యుడైపోవు = మాయమైపోవు ; ఆయుధపాణులు = ఆయుధాలు చేతితో ధరించిన వారు.

**2.** ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1. భీముడు ద్రౌపదితో కలిసి ఎచ్చట సంచరిస్తున్నాడు?
2. ఎర్ర కలువ ఏ విధంగా వుంది?
3. హనుమంతుడు భీముని ఏమి అన్నాడు?
4. వృకోదరుడు హనుమంతుని ఏమని ప్రార్థించాడు?
5. ద్రౌపది ఎందుకు సంతోషించింది?

**3. 30-40** పదాలలో జవాబులు రాయండి.

1. భీముడు పుష్పాల కోసం ఎందుకు బయలుదేరాడు?
2. వెళ్ళిపొమ్మన్న హనుమంతునికి భీముడు ఏమని బదులు చెప్పాడు?
3. భీమునికి ఏ విధంగా గర్వభంగం కలిగింది?
4. హనుమంతుడు విశ్వరూపం చూపటానికి కారణం ఏమిటి?
5. మారుతి భీమునికి ఏమని వరమిచ్చాడు?
6. భీముడు సౌగంధికా పుష్పాలను ఎలా సేకరించాడు?

**4.** ఎవరు ఎవరితో అనిరి.

1. "నా కోరిక తీరుస్తారు కదూ!"
2. "ఇది మానవులు ప్రవేశించకూడని దేవమార్గం."
3. "లేవడానికి శక్తి లేని వాణ్ణి."
4. "నీవే మర్యాదగా దారి తప్పుకో."
5. "ఇలా నిన్ను పరీక్షించాను."
6. "మీ బలాన్ని వృద్ధిపొందిస్తాను."



**5.** ఖాళీలను పూరించండి.

1. గాలికి ఒక ............ ఎగిరి వచ్చి వారి మధ్య పడింది.
2. ఆ పువ్వు పేరు ..................
3. నిద్రపోతున్న ............ నీవు నిష్కారణంగా లేపావు.
4. మారుతికి ............ నమస్కారం చేశాడు.
5. నా రూపం ఇంతకన్నా ............... పెరిగిపోతుంది.
6. మీకు .................. యుద్ధం జరిగి తీరుతుంది.

6. సంధి చేసి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. భరతము | + ఐన | | 5. చూడాలి | + అని | |
| 2. నీవు | + ఎవరు | | 6. సమాసము | + ఐన | |
| 3. ఏమి | + అనుకున్న | | 7. భయంకర | + ఆకారులు | |
| 4. నూరు | + ఆమడలు | | 8. ఆనంద | + అశ్రువులు | |

7. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. అక్కడ ఒక పెద్ద అరటి వనం వుంది.
2. భీముడు భయంకరంగా సింహనాదం చేశాడు.
3. అది వీసమయినా కదలలేదు.
4. భీముడు ఆనందంతో పొంగిపోయాడు.

8. గీతగీసిన పదాలు ఏ పురుషలో రాయండి.

1. నీవు ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు.
2. అంతగా వెళ్ళాలనుకుంటే నన్ను దాటివెళ్ళు.
3. అతన్ని చూడాలని అభిలాష పడ్డాడు.

9. సామాన్య, సంయుక్త వాక్యాలను గుర్తించి రాయండి.

1. భీముడు పుష్పాల కోసం బయలుదేరాడు.
2. ఆ ధ్వనికి కొండలు, గుహలు దద్దరిల్లాయి.
3. లేవడానికి శక్తి లేని వాణ్ని. అంతగా వెళ్ళాలను కుంటే నన్ను దాటి వెళ్ళు.
4. తోక వీసమయినా కదలలేదు. అప్పుడు రెండు చేతులతో ప్రయత్నించాడు.
5. వృకోదరుడికి ఆశ్చర్యం కలిగింది.

10. వాక్యాంగాలు రాయండి.

1. ద్రౌపది పూవును వాసన చూసింది.
2. హనుమంతుడు తన తోకతో భూమిని చరిచాడు.
3. భీముడు సౌగంధిక పుష్పాలను కోసుకొచ్చాడు.

**11.** గుర్తించిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.

1. భీముడు ద్రౌపదితో కలసి సంచరిస్తున్నాడు.
2. భీముడు పుష్పాల కొరకు బయలు దేరాడు.
3. వాయుదేవుని వలన జన్మించిన వాడిని.
4. మారుతి మనసులో సంతోషించాడు.
5. మీ మహిమలను గురించి విన్నాను.

**12.** వ్యుత్పత్త్యర్థాలు :

1. హనుమంతుడు = హనువు కలవాడు - ఆంజనేయుడు.
2. క్షత్రియుడు = క్షత్రము (దెబ్బ) వలన రక్షించువాడు.
3. మారుతి = మరుత్తు (వాయుదేవుడు) కుమారుడు - హనుమంతుడు.
4. వృకోదరుడు = వృక ప్రమాణమైన ఉదరం కలవాడు. (తోడేలు కడుపువాడు) భీముడు.
5. సౌగంధికము = రోగనాశనమునకై యోగ్యమయిన పరిమళముగలది - గంధకము.

విశేషాంశాలు :

1. నూరామడలు = ఆమడ అనగా నాలుగు కోసుల దూరం (యోజనం). కోసు అనగా రెండు మైళ్ళదూరం. నూరామడలు అనగా ఎనిమిది వందల మైళ్ళదూరం.
2. పాండవులు = పాండురాజు కుమారులు. వీరు ఐదుగురు.
3. కౌరవులు = కురువంశ రాజులు. మహాభారతంలో దుర్యోధనాదులు నూరుమంది.

ఉ.సూ : పౌరాణిక సాహిత్యంలోని ప్రసిద్ధ కథలను విద్యార్థులకు వినిపించి ఆ సాహిత్యం పట్ల విద్యార్థులలో అభిరుచిని పెంపొందింప చేయండి.

# సబ్‌మెరీన్

సబ్‌మెరీన్ అంతర్గామి అంటాము. అంటే సముద్ర గర్భంలో ప్రయాణం చేసే ఓడ అని అర్థం. శత్రునౌకలపై రహస్యంగా దాడి చేయడం కోసం ఈ జలాంతర్గాములలో 'టార్పిడో' లు అనబడే మరఫిరంగులు అమర్చబడి వుంటాయి. కనుక వీటిని 'టార్పిడో బోట్లు' అని కూడా అంటారు.



అత్యాధునిక జలాంతర్గాములలో అణుశక్తిని వుపయోగించి రోజుల తరబడి సముద్ర గర్భంలో ప్రయాణం చేయగల సాధనాలు వుంటాయి. అణుశక్తితో వుద్భవించే ఉష్ణంతో నీటిని ఆవిరిగా మార్చి ఆవిరితో పనిచేసే యంత్రాల ద్వారా గాలి ప్రమేయం లేకుండా నడుపుతారు.

నేటి టార్పిడో బోట్లలో సుమారు 150 మంది సిబ్బంది ప్రయాణం చేస్తారు. నౌకాయానానికి అతి ముఖ్యమైనది దిక్సూచి రాడారు. గైరోస్కోపు వగైరాల స్థానే అగాధంలో పనిచేసే అనేక ఆధునిక పరికరాలతో సబ్‌మెరీన్ తన రహస్యయానం చేస్తుంది. టార్పిడోల బదులు మిసైల్సు, రాకెట్లు మొదలైన మారణయంత్రాలు ప్రవేశపెట్టబడ్డాయి. వీటిని నీటిలో ప్రయోగించి 2,500 మైళ్ళ దూరంలో వున్న శత్రుస్థావరాన్ని ధ్వంసం చేయవచ్చును. ఈ ఆధునిక యుగంలో దేశరక్షణ కోసం ఉపయోగపడే అతి ముఖ్యమైన యుద్ధసామాగ్రితో 'సబ్‌మెరీన్' ది ప్రముఖస్థానం అనడంలో సందేహం లేదు

# ఆరోగ్యమే మహాభాగ్యం



సూచనలు : మనం కొంచెం జాగ్రత్తతో ఆరోగ్య, పరిశుభ్రతా సూత్రాలను పాటిస్తే ఎన్నో వ్యాధులను నిరోధించుకోవచ్చును.

- పరిశుభ్రంగా ఉండండి. ఆటలు ఆడిన తరువాత ఇంటికి రాగానే కాళ్ళు - చేతులు బాగా కడుగుకోవాలి.
- ప్రతి రోజు రెండుసార్లు పళ్ళు తోముకోవాలి.
- తలవెంట్రుకలు, గోళ్ళు శుభ్రంగా ఉంచుకోవాలి.
- మరుగు దొడ్డి (టాయిలెట్) ని శుభ్రంగా ఉంచండి. మలవిసర్జనానంతరం చేతులు బాగా కడుగుకోవాలి.
- కాళ్ళకు చెప్పులు వేసుకోకుండా బయట తిరుగరాదు.
- ఆహార పదార్థాలను ఎల్లప్పుడు మూతలు పెట్టి ఉంచాలి. మూత లేకుండా ఉంచకూడదు.
- మిఠాయిలు, నూనె లేదా మసాలాతో కూడిన ఆహార పదార్థాలు తినడం తగ్గించండి. పుష్టికరమైన తేలిక పదార్థాలు భుజించాలి.
- నీరు పుష్కలంగా త్రాగాలి. కాచి, చల్లార్చి త్రాగుట మంచిది.

## మాదిరి ప్రశ్నాపత్రము

అ. క్రింది ప్రశ్నలకు ఒక వాక్యములో జవాబులు రాయండి.

1. తల్లి కుమారుని ఏమని కోరింది?
2. ఎర్ర కలువ ఏ విధంగా వుంది?
3. "కబ్" అని ఎవరిని అంటారు?
4. చిలుక, ఎలుకలకు ఏం దొరికాయి?
5. కంప్యూటర్ అంటే ఏమిటి?

ఆ. క్రింది ప్రశ్నలకు ఒక వాక్యములో జవాబులు రాయండి.

1. సజ్జను లెట్లుందురు?
2. ఎట్టి చదువు నిరర్థకము?
3. వ్యాసుడు రచించిన గ్రంథమేది?
4. చలి మంటలు ఏ కాలమున వేసుకొందురు?
5. మన దేశము ఎవరికి మార్గదర్శకము?

అ. ఎవరు ఎవరితో అనిరి.

1. "ఆకలితో ఏం అవస్థలు పడుతుందో!"
2. "స్వేచ్ఛ లేక సుఖం ఎక్కడుంది?"
3. "నన్ను ఆశీర్వదించు."
4. "నీవే మర్యాదగా దారి తప్పుకో"
5. "కంప్యూటర్‌కు ఇంటర్నెట్‌తో అనుసంధానం ఉండాలి."

ఆ. ఎవరు ఎవరితో అనిరి.

1. "వేదసారి మెరిగించిన దేశం."
2. "చదువెందుకు చదవలేదు."
3. "దేశభాషలందు తెలుగు లెస్స."
4. "గుణ సంయుతు లెవ్వరు మెచ్చరు."
5. "పసుల వన్నెలెన్నొ పాలొకటియె."

అ. **30-40** పదాలలో జవాబులు రాయండి.

1. మూడు అమూల్యాభరణాలు గురించి తల్లి ఏమని వివరించింది.
2. చిలుక వెళ్ళి పోయిన తర్వాత ఎలుక ఏం చేసింది?
3. మారుతి భీమునికి ఏమని వరమిచ్చాడు?
4. కోపించిన వ్యాపారితో గోరింక ఏమని పలికింది? దాని ఫలితమేమి?
5. వికీపీడియా ఉపయోగాలేమిటి?

ఆ. **30-40** పదాలలో జవాబులు రాయండి.

1. శిశిర ఋతువున ప్రకృతిలో కలుగు మార్పు ఏమి?
2. మన దేశమున ఎటువంటి మహనీయులు జన్మించిరి?
3. కొడుకు ప్రశ్నవిన్న తల్లి ఏమని జవాబిచ్చెను?
4. తెలుగు భాష ఔన్నత్యమెట్టిది?
5. సహనము కల్గుట కష్టమని కవి ఎట్లు తెలియజేసెను?

క్రింది అంశాలపై సుమారు **150** పదాలలో వ్యాసాన్ని రాయండి.

1. నీకు నచ్చిన పండుగ.
2. పర్యావరణ కాలుష్యము
3. క్రమశిక్షణ ఆవశ్యకత
4. విహారయాత్రలు.

1. మీ పాఠశాలలో జరుపుకున్న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను గురించి తెలుపుతూ మీ స్నేహితురాలికొక లేఖ రాయండి.
2. నీవు సందర్శించిన (సైన్స్ ఎగ్జిబిషన్) విజ్ఞాన సందర్శనను గురించి సోదరునికి లేఖ రాయండి.
3. పుస్తకాలు కొనుక్కోవడానికి కావలసిన డబ్బు పంపించమని తండ్రికి లేఖ రాయండి.

ఆ. దిగువ సారాంశమును చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

మన భారతదేశం ఎన్నో పుణ్యక్షేత్రాలకు నిలయం. వాటిలో మన ఆంధ్రరాష్ట్రంలో గల శ్రీశైలక్షేత్రం చాలా పురాతనమైంది. శ్రీశైలంలోని

మల్లిఖార్జున లింగం పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటి. శ్రీశైలాన్ని శ్రీపర్వతం అని కూడా అంటారు. ఇది కర్నూలు జిల్లాలోని నల్లమల కొండలలో ఉంది.

శ్రీశైలం సమీపిస్తున్నపుడు దారిలో శిఖరేశ్వర స్వామి ఆలయం ఉంది. అక్కడి నుండి చూస్తే శ్రీశైల మల్లిఖార్జుని గుడిపైగల బంగార కలశం కనిపిస్తుంది. ఈ శిఖర దర్శనం పుణ్యాన్ని కలిగిస్తుందని ఎంతో మంది నమ్మకం. గుడిగోపురాలపైనా, ప్రాకారాలపైనా, గుడిలోపల చక్కటి శిల్పాలు మనకు కనిపిస్తాయి.

ఇక్కడి దేవాలయాన్ని కాకతి మైలమదేవి కట్టించినట్లు చెపుతారు. నాగార్జునుడు, శంకరా చార్యులు, ఛత్రపతి శివాజీ, శ్రీకృష్ణ దేవరాయలు మొదలయినవారు ఈ క్షేత్రాన్ని దర్శించారు.

ప్రశ్నలు :

1. శ్రీశైల క్షేత్రం ఎచ్చట కలదు?
2. శ్రీశైల క్షేత్రానికున్న మరొక పేరేమి?
3. శ్రీశైలంలో ఉన్న దేవుని పేరేమి?
4. శ్రీశైల దేవాలయాన్ని ఎవరు కట్టించారు?
5. శ్రీశైల దేవాలయాన్ని దర్శించిన ప్రముఖుల పేర్లేమి?

అ. గీతగీచిన పదాలు ఏ భాషాభాగాలో తెల్పండి.

1. భరతుడు మును పాలించిన దేశము.
2. భీముడు భయంకరంగా సింహనాదం చేశాడు.
3. నేను స్కాట్‌లో చేరాను.
4. అవి గింజలు పంచుకోవడం ప్రారంభించాయి.

ఆ. గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.

1. ముంబయిలో ఉట్ల పండుగను ఘనంగా జరుపుకుంటారు.
2. వినడం కొరకు రెండుస్పీకర్లు ఉంటాయి.
3. మీ మహిమలను గురించి విన్నాను.
4. వాయు దేవుని వలన జన్మించినాను.



# మౌఖిక పరీక్ష



1. గద్యభాగము, పద్యభాగము విద్యార్థులచే పఠింప చేయండి.

   ఉచ్చారణాదోషాలు లేకుండా సరిగా చదువగలుగుచున్నారా? లేదా? గమనించండి.

2. గద్య, పద్య భాగములను ప్రకాశ పఠనముగావించి దానిపై విద్యార్థులను ప్రశ్నించండి. ఎంత వరకు అవగాహన చేసుకున్నరో గమనించండి.

3. విద్యార్థులను సమూహాలుగా విభజించి కొన్ని విషయాలను ఇచ్చి వాటిపై చర్చింప చేయండి.

   ఉదా :- టి.వి. కార్యక్రమాలు, చలన చిత్రాలు, ప్రయోజనాలు, నేటి విద్యావిధానం మొ॥నవి.

4. ఒక అంశాన్ని ఇచ్చి ఇద్దరు విద్యార్థులచే సంభాషింప చేయండి.

   ఉదా:- కత్తి గొప్పదా? కలంగొప్పదా? పరీక్షా పద్ధతిపై అభిప్రాయం మొ॥నవి.

5. చిత్రమును రెండు నిమిషాలు చూపించి వాటి గురించి విద్యార్థులను పది వాక్యాలలో చెప్పమనండి.

   ఉదా:- వాతావరణ కాలుష్యము, గాంధీజీ, రోడ్డు ప్రమాదము మొ॥నవి.

# వ్యాకరణము

1. సామాన్య వాక్యము : ఒకే క్రియా పదము కలిగి సంపూర్ణ అర్థము నిచ్చు వాక్యము.

ఉదా : నేను పాఠమును చదివితిని.

రాముడు బజారుకు వెళ్ళెను.

2. సంయుక్త వాక్యము : రెండు లేక అంతకు మించిన సామాన్య వాక్యములు కలియగా ఏర్పడునది సంయుక్త వాక్యము.

ఉదా : నేను పాఠమును చదివితిని. దానిని పుస్తకములో రాసితిని.

రాముడు బజారుకు వెళ్ళెను. అక్కడ అతడు కూరలు కొనెను

భాషాభాగములు : ఇవి ఐదు.

1) నామవాచకము 2) సర్వనామము 3) క్రియ 4) విశేషణము 5) అవ్యయము

1. నామవాచకము : పేర్లను తెలియ జేయుపదాలు.

ఉదా : కరుణ, పర్వతము, టమాట మొదలగునవి.

2. సర్వనామము : నామవాచకమునకు బదులుగా వాడబడునవి.

ఉదా : వాడు, అతడు, అమె మొదలగునవి.

3. క్రియ : పనిని తెలుపునది.

ఉదా : రాయుట, పాడుట, తినుట, పరిగెత్తుట మొదలగునవి.

4. విశేషణము : నామవాచకములలోని, సర్వనామములలోని విశేష విషయమును (రంగును, స్వభావమును, గుణమును) తెలియ జేయునది.



ఉదా : 1) ఎఱ్ఱని పూవు 2) మంచి బాలుడు 3) వేగముగా పరుగెత్తును.



5. అవ్యయము : లింగ, వచన, విభక్తులు లేని పదాలను అవ్యయములు అందురు.

ఉదా : ఆహా, ఓహో, ఔరా, సర్వత్రా!, అక్కడ, అప్పుడు మొదలగునవి.


విభక్తి ప్రత్యయములు : వాక్యములోని పదాలకు పరస్పర సంబంధము కలిగించునవి విభక్తులు : ఆవిభక్తులను తెలియజేయునవి ప్రత్యయములు.

| | | |
|---|---|---|
| ప్రథమా విభక్తి | - | డు, ము, వు, లు |
| ద్వితీయా విభక్తి | - | నిన్, నున్, లన్, కూర్చి, గురించి |
| తృతీయా విభక్తి | - | చేతన్, చేన్, తోడన్, తోన్ |
| చతుర్థీ విభక్తి | - | కొఱకున్, కై |
| పంచమీ విభక్తి | - | వలనన్, కంటెన్, పట్టి. |
| షష్ఠీ విభకి | - | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ |
| సప్తమీ విభకి | - | అందున్, నన్ |
| సంబోధనా ప్రథమా విభక్తి | - | ఓ, ఓయి, ఓరి, ఓసి |

 లకు  లే ల 

 తో  ఊడ్చు  వేయి

 తిని  పెట్టు

 ఎక్కి  కోయి

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె - 411 004.

तेलुगू सरला भारती- इ. ८ वी.

Rs. 15.00

